


మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY



సంపుటి 11 | సంచిక 211 | కర్నూలు | ఆదివారం 13-09-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


- ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం
- జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్
- 49 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు
- విజయవాడ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

# భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి



అమరావతి, సెప్టెంబర్ 12(శ్రీచక్ర) వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

# ఏపీలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయండి..


## అధికారులకు పవన్ దిశానిర్దేశం



అమరావతి, సెప్టెంబర్ 12(శ్రీచక్ర) : రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ సూచనలు చేశారు. ఏఎస్ఆర్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. వాగులు పొంగుతున్న వేళ ప్రత్యామ్నాయ

అవసరం ఉన్న చోట తక్షణం పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ అప్రమత్తం చేశారు. గంగవరం సమీపంలో ఆంధ్రప్రదేశ్ - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిందని చెప్పుకొచ్చారు. సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అవసరం ఉన్న చోట తక్షణమే పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అలర్ట్ చేశారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

# బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ



సెప్టెంబర్ 12: ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు ప్రారంభ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ రకమైన పాశ్చాత్య లేదా ఇతర వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని, అందరినీ కలుపుకొనిపోయే భాగస్వామ్య వేదిక అని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడంలో 'మానవాభివృద్ధే కీలకం' అనే నమూనాను అనుసరిస్తోందన్నారు. మారుతున్న గ్లోబల్ పరిణామాలకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి , ఇతర ప్రపంచ సంస్థలలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) స్వరాన్ని మరింత బలపరచాలని కోరారు. బ్రిక్స్ ప్రారంభమై రెండు దశాబ్దాలు పూర్తిచేసుకున్న సందర్భంలో, కూటమి సాధించిన ఏకాభిప్రాయాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు సాధించే దిశగా తీసుకెళ్లాలని మోదీ సూచించారు. అన్ని నిర్ణయాలు, కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగేందుకు బ్రిక్స్ లోపల ఒక ప్రత్యేక 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు.

# 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు బ్రిక్స్ కూటమి ఏకగ్రీవ ఆమోదం

ఢిల్లీ, సెప్టెంబర్ 12:(శ్రీచక్ర) బ్రిక్స్ సదస్సులో చారిత్రక ఘట్టం నమోదైంది. సదస్సులో భాగంగా రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కు కూటమిలోని సభ్య దేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతున్న పశ్చిమాసియా సంక్షోభంపైనా సభ్య దేశాల మధ్య స్పష్టమైన ఏకాభిప్రాయం వ్యక్తమైంది. పశ్చిమాసియా పరిణామాలపై బ్రిక్స్ కూటమి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఏ రకమైన సమస్యకూ యుద్ధం పరిష్కారం కాదని స్పష్టం చేసింది. శాంతిని నెలకొల్పడానికి నిరంతర చర్చలు, దౌత్య మార్గాలే ఏకైక పరిష్కారమని సభ్య దేశాలు తేల్చిచెప్పాయి. 'న్యూఢిల్లీ డిక్లరేషన్'లోని ముఖ్యాంశాలు 1. పశ్చిమాసియా సంక్షోభం-శాంతి: పశ్చిమాసియా సంక్షోభం సహా ఎలాంటి అంతర్జాతీయ సమస్యలకైనా యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాలు, చర్చల ద్వారానే శాంతి సాధ్యమని స్పష్టం చేశారు. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 2. ఐరాస సంస్కరణలు: మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 3. మానవాభివృద్ధే ప్రాధాన్యం: భారత్ నేతృత్వంలో ఈ సదస్సు (మానవాభివృద్ధే ప్రథమం) ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించారు. 4. ఆర్థిక సవాళ్లు, డిజిటల్ సహకారం: ప్రపంచ సరఫరా వ్యవస్థలను బలపరచడం, ఆహార-ఇంధన భద్రత, స్థానిక కరెన్సీల ద్వారా వ్యాపారాన్ని పెంపొందించడం వంటి ఆర్థిక అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. సదస్సును ఉద్దేశించి భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, బ్రిక్స్ కూటమి ప్రయాణంలో ఇది కీలక ఘట్టమని పేర్కొన్నారు. బ్రిక్స్ కూటమి ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సభ్య దేశాల ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

## 1980 స్టైల్ ఫోటోల ట్రెండ్‌తో ....

# సైబర్ నేరగాళ్ల కొత్త మోసం

- ఫొటో మార్ఫింగ్‌తో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న కేటుగాళ్లు
- ఫేక్ యాప్‌లు, అనధికారిక ఏఐ టూల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- వ్యక్తిగత ఫొటోలను అప్‌లోడ్ చేసే ముందు జాగ్రత్త తప్పనిసరి






(శ్రీచక్ర న్యూస్ ప్రత్యేక కథనం)

సోషల్ మీడియాలో ప్రస్తుతం 1980ల నాటి పాతకాలపు లుక్, దుస్తులు, హెయిర్‌స్టైల్‌తో ఫొటోలు తయారు చేసుకోవడం, ముఖాన్ని మార్ఫింగ్‌చేయడం వంటి ట్రెండ్స్ విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. ప్రజలను ఆకట్టుకుంటున్న ఈ సరదా ట్రెండ్‌ను కొందరు సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుని వ్యక్తిగత ఫొటోలను దుర్వినియో గం చేసే ప్రమాదం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్టైల్, లుక్ మార్చుకోవాలనే ఉద్దేశంతో వివిధ అనధికారిక యాప్‌లు, వెబ్‌సైట్లు, ఏఐ ఆధారిత ఫొటో ఎడిటింగ్ టూల్స్‌లో వ్యక్తిగత ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్న సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. విశ్వసనీయత లేని యాప్‌లకు ఫొటోలు, వ్యక్తిగత సమాచారం లేదా ఇతర అనుమతులు ఇవ్వడం వల్ల ఆ డేటా దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది.


**ఫొటోలను అసభ్యకర వీడియోలుగా మార్ఫింగ్ చేస్తున్న కేటుగాళ్లు :** ఇటీవల ఓ ఫోటోగ్రాఫర్ తన ఫొటోలను గుర్తుతెలియని వ్యక్తులు మార్ఫింగ్ చేసి అసభ్యకర వీడియోలుగా రూపొం దించి, తన బంధువులకు పంపుతూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ పోలీ సులనుఆశ్రయించినట్లు సమాచారం. ఇలాంటిఘటనలు ఏఐ ఆధారిత డీప్‌ఫేక్, ఫేస్‌మార్ఫింగ్ టెక్నాలజీలను నేరగాళ్లు ఎలా దుర్వినియోగం చేస్తు న్నారో తెలియజేస్తున్నాయి. ముఖ్యం గా సోషల్ మీడియాలో బహిరం గంగా అందుబాటులో ఉన్న ఫొటోల ను సేకరించి, వాటికి మార్పులు చేసి బాధితులను భయపెట్టడం, పరువు తీస్తామని బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉంది.

**వాట్సాప్ కాంటాక్ట్స్ ద్వారా మరింత ఒత్తిడి:** కొన్ని సందర్భాల్లో బాధితుల సోషల్ మీడియా లేదా మెసేజింగ్ ఖాతాల భద్రత దెబ్బతిం టే, వారి కాంటాక్ట్‌లకు కూడా నేరగా ళ్లు చేరుకునే అవకాశం ఉంటుంది. బాధితుడి ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరమైన (మిగతా 2లో )

# ఈనెల 16న కర్నూలులో జాబ్ మేళా

## 1,053 ఉద్యోగాల భర్తీకి అవకాశం..

## రాష్ట్ర మంత్రి టీజీ భరత్



కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): కర్నూలు నగరంతో పాటు జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 16వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. వివిధ రంగాలకు చెందిన సంస్థల్లో మొత్తం 1,053 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. అభ్యర్థుల విద్యార్హతలకు అనుగుణంగా వివిధ రకాల ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కర్నూలు నగరంతో పాటు జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి టీజీ భరత్ కోరారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా యువత భవిష్యత్‌కు భరోసా కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరూ జాబ్ మేళాకు హాజరై తమ విద్యార్హతలకు తగిన ఉద్యోగాన్ని పొందేందుకు ప్రయత్నించాలని మంత్రి సూచించారు. కర్నూలు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కెరీర్‌కు మంచి బాట వేసుకోవాలని టీజీ భరత్ ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## జన జీవితాలలో కన్పించని జీడీపీ వృద్ధి

జనులు జీడీపీ అంకెలను భుజిస్తారా? అని ఒక విజ్ఞుడు ప్రశ్నించాడు. ఆ ప్రశ్న ఒక వ్యంగ్య ఛలోక్తి. నిజమే. ప్రజలు ఆహారాన్ని తింటారు, వస్త్రాలను ధరిస్తారు, పాదరక్షలు వేసుకుంటారు, తమ పిల్లలను బడికి పంపుతారు, వ్యాధుల నుంచి విముక్తికి ఔషధాలు కొనుక్కుంటారు, మొబైల్ ఫోన్స్ ఉపయోగిస్తారు. వీటితో పాటు టెలివిజన్ కార్యక్రమాలను వీక్షిస్తారు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులను చదవడంలో నిమగ్నమవుతారు, భద్రమైన జీవనం, సంతోషదాయక జీవితాన్ని కోరుకుంటారు? ఇవన్నీ వ్యక్తుల వినియోగాలు. ఈ మొత్తం వినియోగాల విలువ ఎంత? ప్రభుత్వం విధించే, ఇచ్చే రాయితీలను పరిగణనలోకి తీసుకున్న తరువాత వినియోగం (కన్సంప్షన్), మదుపు (ఇన్వెస్ట్‌మెంట్), ప్రభుత్వ వ్యయం (గవర్నమెంట్ స్పెండింగ్), నికర ఎగుమతులు (ఎక్స్?ఎమ్) మొత్తమే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ). ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని కొలవడానికి జీడీపీ వృద్ధిరేటు చాలా ముఖ్యం. 2026?27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) జీడీపీ అంకెలను గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసింది. 2025?26 ఆర్థిక సంవత్సర మొదటిత్రైమాసికంతో పోలిస్తే జీడీపీ వృద్ధిరేటు నామమాత్ర (ప్రస్తుత) ధరల ప్రకారం 10.3 శాతంగాను, స్థిర ధరల ప్రకారం 7.8 శాతంగాను నమోదయింది. ఈ గణాంకాల పట్ల ప్రభుత్వ ఆర్థికవేత్తలు ఎనలేని సంతృప్తి, ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సంశయగ్రస్తులూ తక్కువేవీ కాదు. వీరు అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జీడీపీ గణాంకాల విశ్వసనీయతపై ప్రస్తుతం ఒక తీవ్ర చర్చ నడుస్తోంది. ఫెడరల్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే 'ఒక దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై కంటే జీడీపీ అంకెలు, వాటి పెరుగుదల ప్రయోజనాలు ప్రజల జీవితాల్లో ప్రతిబింబిస్తున్నాయా అన్న విషయమై చర్చించడం మంచిది. గణాంకాల, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ వెల్లడించిన జీడీపీ అంకెలు సరైనవని భావిద్దాం. రెండు భిన్న ఆధార సంవత్సరాల (బేస్ ఇయర్స్) ప్రాతిపదికన నామమాత్ర జీడీపీ, వాస్తవ జీడీపీ సంయుక్త వార్షిక వృద్ధిరేటు (కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్ రేట్? సీఏజీఆర్) ఇలా ఉంది: సంవత్సరం ఎదుట బ్రాకెట్‌లోని మొదటి సంఖ్య ప్రస్తుత ధరల ప్రకారం నామమాత్ర జీడీపీని, రెండో సంఖ్య స్థిర ధరల ప్రకారం వాస్తవ జీడీపీని లక్షల కోట్ల రూపాయల్లో సూచిస్తుంది: ఆర్థిక సంవత్సరం 2022?23: (268.90, 161.65); 2023?24: (301.23, 176.51); 2024?25: (330.68, 187.97); 2025?26: (357.14, 201.90)సీఏజీఆర్: నామమాత్ర జీడీపీకి 9.92శాతం; వాస్తవ జీడీపీకి 7.69శాతం. ఆధార సంవత్సరం 2022?23 ప్రాతిపదికన జీడీపీ అంకెలు ఇలా ఉన్నాయి: ఆర్థిక సంవత్సరం 2022?23: (261.77, 261.77); 2023?24: (290.73, 280.94); 2024?25: (317.99, 301.15); 2025?26: (345.37, 324.70). సీఏజీఆర్: నామమాత్ర జీడీపీకి 9.68శాతం; వాస్తవ జీడీపీకి 7.45శాతం. కొత్త ఆధార సంవత్సరం ప్రాతిపదికన 2026?27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నామమాత్ర జీడీపీ 88.26 లక్షల కోట్లు కాగా వాస్తవ జీడీపీ 81.36 లక్షల కోట్లు. 2025?26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సర మొదటి త్రైమాసికంలో పెరుగుదల నామమాత్ర జీడీపీ 10.33శాతం, వాస్తవ జీడీపీ 7.82శాతం. పరిగణనలోకి తీసుకున్న నాలుగు ఆర్థిక సంవత్సరాలకు గాను సీఏజీఆర్ పాత, కొత్త ఆధార సంవత్సరాల ప్రాతిపదికన ఇంచుమించు ఒకే విధంగా ఉండడం గమనార్హం. 2026?27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు స్వల్పస్థాయిలో మాత్రమే అధికంగా ఉన్నది. దీన్నిబట్టి దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి మనం ఎటువంటి అభిప్రాయానికి రావచ్చు? ఇదీ నా అభిప్రాయం: 2026?27లో భారత ఆర్థిక వ్యవస్థ దశ దిశ మారలేదు. దాని పురోగమనం వేగం పుంజుకోలేదు. మరి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి నిజంగా ఏమైనా ఉందా? ఏమీలేదు. పాత ఆధార సంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో స్థిర ధరల్లో జీడీపీ, నామమాత్ర ధరల్లో జీడీపీతో పోలిస్తే చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. అయితే కొత్త ఆధారసంవత్సరం ధరల ప్రాతిపదికన అంచనాలలో అలా లేదు. ఎందుకని? ఆ వ్యత్యాసం చాలా చికాకుపరచడం లేదూ? అదలా ఉంచితే అంకెల్లో ఘనంగా ఉన్న జీడీపీ వృద్ధిరేటు సామాన్య ప్రజల జీవితాల్లో అంతే ఉజ్వలంగా ప్రతిబింబిస్తున్నదా? ఉద్యోగాల సృష్టి, వేతనాల పెరుగుదల, వినియోగం పరిమాణం, వ్యాపార వాణిజ్యాలు, పెట్టుబడులు మొదలైన విషయాలలో ఆ వృద్ధి ఎలా కనిపిస్తోంది? కొన్ని ప్రాసంగిక ప్రశ్నలు: 15 నుంచి 29 సంవత్సరాల వయసు యువజనులలో నిరుద్యోగిత రేటు అధిక స్థాయిలో 16.2శాతం మేరకు ఎందుకు ఉన్నది? 29 నుంచి 34 సంవత్సరాల వయసులో ఉన్న పట్టభద్రులలో నిరుద్యోగిత రేటు తరచూ 40 నుంచి 45శాతం దాకా ఉంటోంది. కారణమేమిటి? నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం? 15 నుంచి 29 సంవత్సరాల వయసులో ఉన్న 8.7 కోట్ల మంది యువజనులు అటు ఉద్యోగంలో గానీ, ఇటు విద్యాభ్యాసం, వృత్తిపరమైన శిక్షణలో గానీ లేరు. ఎందుకని?; వాస్తవ వేతనాల పెరుగుదల చాలా నిరుత్సాహకరంగా ఉన్నది. రోజువారీ కూలీలు, వేతన ఉద్యోగులు, స్వయం ఉపాధి కార్మికులకు ఆ వాస్తవ వేతనాల పెరుగుదల వరుసగా (?) 5.5, 1.7, 3.3 శాతంగా మాత్రమే ఉంది. దేశ కార్మికశక్తిలో రోజువారీ కూలీలు 20శాతంగా ఉన్నారు. వాస్తవ వేతనాల పెరుగుదల అంత ప్రతికూలంగా ఉన్నప్పుడు కాయకష్టంపై బతుకుతున్న కోట్లాది శ్రామికుల తక్కువగా ఎందుకు ఉన్నాయి? ఎఫ్‌సీఎన్ఆర్ (ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్? ప్రవాస భారతీయుల కోసం భారతదేశంలోని బ్యాంకుల్లో విదేశీ కరెన్సీలోనే డబ్బు దాచుకునే సౌలభ్యమున్న ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా. ఈ డిపాజిట్లపై 6 నుంచి 7శాతం వడ్డీ ఇస్తారు) నిధులు పెద్ద ఎత్తున సమకూరుతుండగా విదేశీ పెట్టుబడులు ప్రత్యక్ష మదుపులుగా ఎందుకు రావడం లేదు

# 1980 స్టైల్ ఫోటోల ట్రెండ్‌తో ....

మొదటిపేజీ తరువాయి...

వీడియోలులేదా చిత్రాలుగా రూపొందించి, కుటుంబ సభ్యులు, స్నేహితులు,బంధువులకుపంపుతామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసే బ్లాక్‌మెయిల్ మోసాలు జరుగుతున్నాయి. డబ్బులు చెల్లిస్తే సమస్య పరిష్కారమవుతుందని భావించడం మరింత ప్రమాదకరం. ఒకసారిడబ్బులు చెల్లించిన తర్వాత కూడా నేరగాళ్లు మరింత డబ్బు కోసం మళ్లీ మళ్లీ బెదిరించే అవకాశం ఉంటుంది.

**ఏఐ టెక్నాలజీని నేరగాళ్లు దుర్వినియోగం చేసే అవకాశం:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ఆధారితఫొటో,వీడియో ఎడిటింగ్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఫొటోల రూపాన్ని మార్చడం గతంతో పోలిస్తే చాలా సులభమైంది. ఇదేసాంకేతికతనుకొందరు నేరగాళ్లు డీప్‌ఫేక్‌లు, ఫేస్ మార్ఫింగ్, నకిలీ వీడియోలు తయారు చేసేందుకు దుర్వినియోగంచేసే ప్రమాదంఉంది. అందువల్ల "ట్రెండ్ కోసం ఒక్క ఫొటో మాత్రమే కదా" అని నిర్లక్ష్యంగా భావించకుండా, ఏ యాప్ లోకి ఫొటోను అప్‌లోడ్‌చేస్తున్నాం?ఆయాప్‌విశ్వసనీయమైనదేనా? ఫొటోనుఎలాఉపయోగిస్తారు?వంటి అంశాలను పరిశీలించడం అవసరం.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** తెలియని లేదా అనధికారిక యాప్‌లలో వ్యక్తిగత ఫొటోలను అప్‌లోడ్ చేయకూడదు.

యాప్ అడిగే అనవసరమైన కెమెరా, గ్యాలరీ, కాంటాక్ట్స్ వంటి అనుమతు లను ఇవ్వకూడదు. సోషల్‌మీడియా ఖాతాలను సాధ్యమైనంతవరకు ప్రైవేట్‌గా ఉంచాలి.

వాట్సాప్, సోషల్ మీడియా ఖాతాలకు టూ-స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.

తెలియని లింకులు, ంఖఐ ఫైళ్లు, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదు.

ఫొటోలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికైనా పంపే ముందు అవి దుర్వినియోగం అయ్యే అవకాశాన్ని గుర్తించాలి.

డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ వీడియో కనిపించిన వెంటనే దాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా సంబంధిత వ్యక్తులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

**బ్లాక్‌మెయిల్‌కు గురైతే ఏం చేయాలి?:** ఇలాంటి ఘటనకు గురైన వ్యక్తులు భయపడి నేరగాళ్లకు డబ్బులు చెల్లించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నేరగాళ్లతో జరిగిన చాట్, ఫోన్ నంబర్లు,ఖాతా వివరాలు,పంపినలింకులు,బెదిరింపు సందేశాలు, స్క్రీన్‌షాట్‌లు వంటి ఆధారాలను భద్రపరచాలి. వెంటనే స్థానిక పోలీసులను లేదా సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించి ఫిర్యాదు చేయాలి. అత్యవసర ఆర్థిక సైబర్ మోసం జరిగితే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించడం ద్వారా వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి ట్రెండ్‌ను అనుసరించే ముందు దాని వెనుక ఉన్న ప్రమాదాలను గుర్తించాలి. సరదా కోసం అప్‌లోడ్ చేసిన ఒక్క ఫొటో భవిష్యత్తులో సమస్యగా మారకుండా వ్యక్తిగత డేటా భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి.

# డి. కొట్టాలలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

## భక్తిశ్రద్ధలతో గోపూజ, సామూహిక కుంకుమార్చన





రుద్రవరం, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రుద్రవరం మండలం డి.కొట్టాల గ్రామంలోని శ్రీరామాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం గోపూజ, సామూహిక కుంకుమార్చనతో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు ప్రతిరోజూ స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో భజనలు నిర్వహించగా, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు శ్రీశ్రీ నిత్యతృప్తదాస్ స్వామీజీ శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీత తదితర అంశాలపై నిర్వహించిన ధార్మిక ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ సమాజంలో భక్తిచింతన పెరిగినప్పుడే సుఖసంతోషాలు, ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరుస్తాయని అన్నారు. ధార్మిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో భక్తి, ఆధ్యాత్మిక భావనలను పెంపొందించేందుకు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అర్చకులు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో గోవును సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులతో సామూహిక కుంకుమార్చన, గోపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి బ్రహ్మానందరెడ్డి, నరసింహారెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాముడు, కృష్ణ, నాగరాజు, మల్లికార్జున్, దస్తగిరిరెడ్డితో పాటు గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.2.82 కోట్లతో ఐపీహెచ్ఎల్, ఆధునిక వైద్య పరికరాలు ప్రారంభం: మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి**



బనగానపల్లె, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.1.25 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీ (ఐపీహెచ్ఎల్), అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులు రూ.1.57 కోట్లతో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గ ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు, చికిత్సల కోసం ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఐపీహెచ్ఎల్ అందుబాటులోకి రావడంతో వివిధ రకాల వైద్య పరీక్షలను మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఆధునిక వైద్య పరికరాల ద్వారా రోగులకు మెరుగైన పరీక్షలు, చికిత్స అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాల కోసం అదానీ ఫౌండేషన్ నుంచి రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని తాను లేఖ రాయగా, స్పందించిన సంస్థ మొదటి విడతగా రూ.1.57 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందించిందని మంత్రి తెలిపారు. ఈ పరికరాల ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య పరీక్షలు, మెరుగైన చికిత్స అందించే అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసి విలువైన వైద్య పరికరాలను అందించిన అదానీ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్, సంస్థ ప్రతినిధులకు వైద్యులు, బనగానపల్లె నియోజకవర్గ ప్రజల తరపున మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో అంకితభావంతో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ బైరెడ్డి శబరి, బనగానపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్ లో సీసీ రోడ్డు తో మహర్దశ.., సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభం.., ఊపిరి పీల్చుకున్న స్థానికులు, ప్రయాణికులు..,



కోట, సెప్టెంబర్ 12 (శ్రీ చక్ర):కోట మండలం విద్యానగర్ ఎన్ బికే ఆర్ కాలేజీ రోడ్డు మీదుగా సీసీ రోడ్డు ను నిర్మిస్తున్నారు. ఈ సీసీ రోడ్డు 240 మీటర్లు పొడవు,వెడల్పు 10 మీటర్లు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుంది. కాలేజీ రోడ్డు వరకు సిసి రోడ్డు నిర్మించి తరువాత తారు రోడ్డుతో ఉంటుంది. దీనిలో వెడల్పు 7 మీటర్లు వరకే శాంక్షన్ అయింది కానీ ప్రస్తుతం ఎక్స్ట్రా 3 మీటర్లు పెంచి 10 మీటర్లు వెడల్పు తో ఆర్ అండ్ అధికారులు రోడ్డు వేస్తున్నారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణం కొరకు 1కోటి 80 లక్షల రూపాయలు శాంక్షన్ అయ్యిందని చెప్తున్నారు. ప్రస్తుతం సగం రోడ్డు పూర్తి చేసి తర్వాత గూడలి దగ్గర రోడ్డు పనులు చేస్తారని,ఆ తర్వాత విద్యానగర్ లో పూర్తిచేసిన సగం రోడ్డుకు క్యూరింగ్ చేసి మరలా మిగతా రోడ్డు పూర్తి చేస్తారని, పూర్తి అయ్యేసరికి సుమారు 20 రోజులు పడుతుందని ఆర్ అండ్ బి ఏ ఈ మల్లికార్జున్ తెలిపారు. విద్యానగర్ బజార్ నుండి గూడలి లో కొంత రోడ్డు నిర్మించడానికి మొత్తం సమయం 45 రోజులు పడుతుందని ఆయన తెలియజేశారు. గత ఎన్నో సంవత్సరాల నుండి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, ఎట్టకేలకు ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వంలో ఈ రోడ్డును నిర్మించడం జరిగింది. దీనితో చుట్టూ ప్రక్కల ఉండే కాలనీవాసులకు మంచి అవకాశాలు ఉంటాయి. అంతేకాకుండా ఇప్పటివరకు సక్రమంగా లేని ఈ రోడ్డుతో నానా రకాలుగా దుమ్ము ధూళితో విద్యానగర్ బజార్లో ఉన్న దుకాణాలు ప్రక్కనే ఉన్న కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు మరెన్నో ఉన్నాయి. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణంతో దుమ్ము ధూళి ఇబ్బందుల నుండి బయటపడ్డారు. ఏదేమైనప్పటికీ రోడ్డు నిర్మాణంతో స్థానికులు, దుకాణదారులు పక్కనే కాలనీవాసులు ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అంతేకాకుండా వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును నిర్మించే కాంట్రాక్టర్ త్వరలో పూర్తి చేసి ప్రయాణాలకు,ట్రాఫిక్ కు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ జనసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం



వరదయ్యపాలెం, సెప్టెంబర్ 12(శ్రీచక్ర): సమాజ ఆరోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రోత్సహించాలనే సేవా భావంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో వరదయ్యపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 21 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం కోసం వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా కరోనా విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు పోషించిన పాత్రను గుర్తు చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి అండగా నిలవడం సంతోషంగా ఉందని, జనసేన పార్టీ తరఫున భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా, సేవకుల సంక్షేమానికి తోడ్పడటమే తమ బాధ్యతగా జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జానకి రామయ్య, ఆర్.కె. శ్రీను, శేఖర్, శ్రీధర్, చిరంజీవి, సాగర్, లోహిత్, మురళి, తరుణ్, యుగేష్, బీజేపీ మండల అధ్యక్షుడు కె. దిలీప్ రాయల్, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 21 నుండి 23వ తేదీ వరకు టీటీడీలో వస్త్రాల ఈ - వేలం

తిరుపతి, సెప్టెంబర్ 12( శ్రీచక్ర): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను సెప్టెంబరు 21 నుండి 23వ తేదీ వరకు ఈ - వేలం వేయనున్నారు. కొత్తవి ఆర్ట్ సిల్క్ సారీస్ 132 లాట్లు ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం (వేలములు) 0877-2264429 నంబరులో గానీ, టీటీడీ వెబ్‌సైట్ లిలిలి.ఎనినిబీణనీశ్రీబీ.జీజూ.ఐనీలబి.తిని / లిలిలి.బితితీబీఏజీశ్రీజీ.నీతీణ సంప్రదించగలరు

## మట్టి వినాయక విగ్రహాలతో వినాయక చవితి జరుపుకోవాలి

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: డాక్టర్ శంకర్ శర్మ



కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): వినాయక చవితి ఉత్సవాలను మట్టి వినాయక విగ్రహాలతో జరుపుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలని డాక్టర్ శంకర్ శర్మ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని బండి మెట్ట వద్ద ఉన్న నారాయణ పాఠశాల ఆవరణలో డాక్టర్ శంకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితం కావడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో కర్నూలు నగర ప్రజలు ముందుండాలని, మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని డాక్టర్ శంకర్ శర్మ కోరారు. పర్యావరణహిత వినాయక చవితి వేడుకలతో కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల త్రాగునీటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

### అక్రమంగా నీటిని పొలాలకు మళ్లించిన వారిపై చర్యలు తీసుకోవాలి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి



డోన్, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): దేవనకొండ మండలంలోని పి.కోటకొండ, బండగట్టు గ్రామాల పరిసరాల్లో గాజులదిన్న ప్రాజెక్టు నుంచి డోన్ పట్టణానికి సరఫరా అవుతున్న త్రాగునీటి పైపులైన్‌ను డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పైపులైన్ మార్గంలో కొందరు వ్యక్తులు అక్రమంగా త్రాగునీటిని పొలాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించారు. ప్రజలకు సరఫరా చేయాల్సిన త్రాగునీటిని అక్రమంగా వినియోగించడంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన త్రాగునీటిని దుర్వినియోగం చేయడం ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. అక్రమంగా నీటిని మళ్లిస్తున్న చర్యలను తక్షణమే నిలిపివేయాలని, సంబంధిత వ్యక్తులను గుర్తించి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పైపులైన్‌కు ఎక్కడైనా అక్రమ కనెక్షన్లు, లీకేజీలు లేదా నీటి మళ్లింపులు ఉన్నాయా అనే విషయాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డోన్ పట్టణ ప్రజలకు సరిపడా, శుద్ధమైన త్రాగునీటిని అందించడం ప్రభుత్వ బాధ్యతతో పాటు తన ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగం

కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ సూచన మేరకు కర్నూలు నగరంలోని జిల్లా గోరక్షణ మహా సంఘం ఆవరణలో గాయత్రి గో సేవా సమితి ఆధ్వర్యంలో వరుణ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యాగ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వరుణ యాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయత్రి గో సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మంత్రి టీజీ భరత్ సూచన మేరకు వరుణ యాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు. యాగం ఫలించి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోరక్షణ మహా సంఘం అధ్యక్షురాలు ఇల్లూరు రాజలక్ష్మి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ , గాయత్రి గో సేవా సమితి అధ్యక్షుడు జగదీష్ గుప్తా, కార్యనిర్వహణ అధికారి శోభ, టీఎన్ విజయ్ కుమార్, గుండా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్

### పేదలకు అత్యాధునిక వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత





కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్ఐఎం) పథకం కింద కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు నూతన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు మెరుగైన, అత్యాధునిక ఆరోగ్య సేవలను అందించాలనే లక్ష్యంతో పీఎం-ఏబీహెచ్ఐఎం పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కర్నూలు జిల్లాతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు చికిత్స కోసం వస్తుంటారని పేర్కొన్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో 200 పడకల క్రిటికల్ కేర్ సదుపాయం ఉన్నప్పటికీ, పెరుగుతున్న అత్యవసర వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనంగా 50 పడకలతో అత్యాధునిక క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వైద్య పరికరాలు, సాంకేతిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌కు సమీపంలోనే డయాగ్నస్టిక్ సదుపాయాలు ఉండటంతో రక్త పరీక్షలు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ తదితర పరీక్షలను త్వరితగతిన నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో అత్యవసర శస్త్రచికిత్సలను కూడా వేగంగా నిర్వహించి రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఈ సదుపాయాలు దోహదపడతాయని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వైద్య పరికరాలతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయడం విశేషమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఐసీయూ చికిత్సకు ఒక్కో పడకకు రోజుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చయ్యే పరిస్థితుల్లో, ప్రభుత్వ ఆసుపత్రిలో అర్హులైన పేదలకు అత్యాధునిక క్రిటికల్ కేర్ వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ పీఎం-ఏబీహెచ్ఐఎం పథకం కింద కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్‌కు సుమారు రూ.23.75 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో భవన నిర్మాణ పనులతో పాటు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చినట్లు చెప్పారు. ప్రమాదాలు, తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు, అత్యవసర వైద్య చికిత్స అవసరమయ్యే రోగులకు తక్షణమే క్రిటికల్ కేర్ సేవలు అందించేందుకు ఈ బ్లాక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పడకలకు అదనంగా 50 క్రిటికల్ కేర్ పడకలు అందుబాటులోకి రావడంతో అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఏర్పడిందన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌కు అనుసంధానంగా రెండు అత్యవసర ఆపరేషన్ థియేటర్లను కూడా ఏర్పాటు చేసి అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. డయాగ్నస్టిక్ బ్లాక్‌కు సమీపంలో క్రిటికల్ కేర్ సదుపాయాలు ఉండటం వల్ల రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరీక్షలను త్వరితగతిన నిర్వహించవచ్చన్నారు. దీంతో రోగ నిర్ధారణ, చికిత్సలో జాప్యాన్ని తగ్గించి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు. రాయలసీమ ప్రాంత ప్రజలకు అత్యవసర, క్రిటికల్ కేర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న 200 పడకలు రోగుల అవసరాలకు సరిపోని పరిస్థితి ఉందని, అదనంగా 50 క్రిటికల్ కేర్ పడకలు అందుబాటులోకి రావడం ద్వారా పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఇంద్రాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీ భాయ్, సీఎస్ఆర్ఎంఓ పద్మజ, జీజీహెచ్ ఏవో సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సపై ప్రాథమిక శిక్షణ పొందాలి

### వైద్యుడు దేవుడైతే.. ప్రథమ చికిత్స చేసేవాడు దేవుడి దూత? సెట్కూరు సీఈఓ డాక్టర్ కె. వేణుగోపాల్




కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా సెట్కూరు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో దిన్నెదేవరపాడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో శనివారం ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెట్కూరు సీఈఓడాక్టర్ కె. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రథమ చికిత్స ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. వేణుగోపాల్ మాట్లాడుతూ "వైద్యుడు దేవుడైతే.. ప్రథమ చికిత్స చేసేవాడు దేవుడి దూత"అని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అందించే ప్రథమ చికిత్స బాధితుడిప్రాణాలనుకాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వైద్యులు లేదాఅంబులెన్స్చేరుకునేలోపు సరైన సమయంలో అందించే చిన్న సహాయం కూడా అమూల్యమైన ప్రాణాన్ని కాపాడగలదన్నారు. ప్రథమ చికిత్స వైద్యులు, వైద్య సిబ్బందికేపరిమితమైన అంశం కాదని, ప్రతి పౌరుడు కనీస ప్రాథమిక శిక్షణ పొందాల్సినఅవసరంఉందనిచెప్పారు. అత్యవసర సమయంలో కంగారు పడకుండాపరిస్థితినిఅంచనావేసి,బాధితుడికిధైర్యం చెప్పడంతో పాటుఅవసరమైన వైద్యసహాయంఅందేలాచర్యలుతీసుకోవాలని సూచించారు.

**ప్రయోగశాలల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి:** పాఠశాలలు, కళాశాలల్లోని రసాయన శాస్త్ర ప్రయోగశాలల్లో విద్యార్థులు మరింత అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వేణుగోపాల్సూచించారు. రసాయన పదార్థాలతో ప్రయోగాలు చేసేటప్పుడు ఉపాధ్యాయులు, ప్రయోగశాల సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని, రక్షణ కళ్లద్దాలు, చేతి తొడుగులు వంటి భద్రతా పరికరాలను వినియోగించాలని తెలిపారు. యాసిడ్ లేదా ఇతర రసాయన పదార్థాలుచర్మంపై పడితే వెంటనే ప్రభావిత ప్రాంతాన్ని పుష్కలంగా స్వచ్ఛమైన నీటితో కడిగి,అవసరమైన వైద్యసహాయంపొందాలనిసూచించారు. రసాయనాలు కళ్లలో పడినప్పుడు కళ్లను రుద్దకుండా స్వచ్ఛమైన నీటితో కడుగుతూ వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు. రసాయనాల వల్ల కాలిన గాయాలు ఏర్పడినప్పుడు స్వయంగామందులు,క్రీములులేదాఇతరపదార్థాలు పూయకుండా వైద్యుల సూచనలు పాటించాలని చెప్పారు. రసాయనాల నుంచి వెలువడే పొగ లేదా వాయువులు పీల్చిన సందర్భంలో బాధితుడిని సురక్షితమైన,గాలి ప్రసరణ ఉన్నప్రదేశానికితరలించి,అవసరమైతే తక్షణమే అత్యవసర వైద్య సహాయం పొందాలని సూచించారు. ప్రయోగశాలలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉన్నందున భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

**ప్రమాదం జరిగిన తొలి నిమిషాలు ఎంతో కీలకం:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు శ్రీనివాసరెడ్డి కీలక ప్రసంగకర్తగా పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలను విద్యార్థులకు వివరించారు. ప్రమాదం జరిగిన తొలి కొన్ని నిమిషాలు ఎంతో విలువైనవని, ఆ సమయంలో తీసుకునే సరైన నిర్ణయం ఒకరి జీవితాన్ని కాపాడగలదని తెలిపారు. వైద్యులు లేదా అంబులెన్స్ వచ్చే వరకు బాధితుడిని నిర్లక్ష్యం చేయకుండా, తమకు తెలిసిన ప్రాథమిక ప్రథమ చికిత్సను అందించాలని సూచించారు. రక్తస్రావం, కాలిన గాయాలు, రసాయన ప్రమాదాలు, సీపీఆర్ తదితర అంశాలపై విద్యార్థులకు ప్రదర్శనాత్మకంగా అవగాహన కల్పించారు. అధిక రక్తస్రావం జరిగినప్పుడు శుభ్రమైన గుడ్డ లేదా బ్యాండేజ్‌తో గాయంపై తగిన ఒత్తిడి పెట్టి రక్తస్రావాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించాలని వివరించారు. ×సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరంగుండె ఆగిపోయినట్లు అనిపించే అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహన ఎంతో అవసరమని డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. సరైన శిక్షణ పొందిన వ్యక్తులు అత్యవసర సమయంలో సీపీఆర్ ప్రారంభించడం ద్వారా వైద్య సహాయం అందే వరకు బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశాలను పెంచగలరని చెప్పారు.

**ప్రతి ఇంట్లో ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి:** ప్రతి ఇంట్లో, పాఠశాలలో, కార్యాలయంలో, వాహనంలో ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అందులో బ్యాండేజీలు, గాజ్, ప్లాస్టర్లు, యాంటీసెప్టిక్ వంటి ప్రాథమిక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. మందులను మాత్రం బాధ్యతగా, అవసరమైనప్పుడు వైద్యుల సూచనల మేరకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రథమ చికిత్సపై అవగాహన పెంపొందించుకోవాలని, ఈ జ్ఞానాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులతో పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సెట్కూరు సిబ్బంది, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కక్షి దారులు జాతీయలోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

### ఉమ్మడి జిల్లాలో 61వేల కేసులు పరిష్కారం- ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు






కర్నూలు లీగల్, సెప్టెంబర్ 12 (శ్రీ చక్ర ):కక్షి దారులు జాతీయలోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు కోరారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదనములో జాతీయ లోక్ అదాలత్ ను ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి వాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 61వేల కేసులు పరిష్కారమైనవని, 153 మోటార్ ఆక్సిడెంట్ కేసులలో రూ.10,25,27,963/- లు బాధితులకు నష్టపరిహారంగా భీమా కంపెనీల ద్వారా ఇప్పించడం జరిగిందన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 6 మంది రైతుల వారసులకు రూ.98,000/- నష్టపరిహారంగా ఇప్పించడం జరిగిందని తెలిపారు. లోక్ అదాలత్ లో తమ కేసులను సామ రస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 31 బెంచీలను ఏర్పాటు చేసి 300పైగా సివిల్ కేసులు, 60000 పైగా క్రిమినల్ కేసులు, బ్యాంకు కేసులు 131 పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ కోర్ట్ జిల్లా జడ్జి శ్రీ విద్య , 7వ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రుడు, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంధ్యా రాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ సరోజనమ్మ, మొబైల్ కోర్టు జడ్జి అనూష, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ, ఐదవ అదనపు మెజిస్ట్రేట్ స్రవంతి, కోర్టు మానిటరింగ్ సి. ఐ. రామానాయుడు, న్యాయ వాదులు, బ్యాంక్ అధికారులు, బి యస్ యన్ యల్ అధికారులు, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## మట్టి వినాయక విగ్రహాల వినియోగంతోనే పర్యావరణ పరిరక్షణ

### ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసు

కర్నూలులీగల్,సెప్టెంబర్12(శ్రీచక్ర ):మట్టివినాయకవిగ్రహాల వినియోగంతోనే పర్యావరణ పరిరక్షణ అని ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. వాసుఅన్నారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మట్టివినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వాసు ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలవల్ల నీటికాలుష్యం ఏర్పడుతుందని కానీ మట్టి వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించడంతో పాటు, సహజసిద్ధమైన మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసి పూజించే సంస్కృతిని విద్యార్థుల్లో, ప్రజల్లో ప్రోత్సహించలన్నారు. న్యాయమూర్తి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లడుతూ జిల్లా జడ్జి గారి చొరవతో పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేసామనితెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులానే పూజించాలని దీని వలన పర్యావరణ దెబ్బ తినకుండా ఉంటున్నదని తెలిపారు. అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుతూ భక్తిని కొనసాగించేలా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. అసోసియేషన్ ఆఫ్ అలియాన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాబోయే తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. అనంతరం జిల్లా జడ్జి చేతుల మీదుగా న్యాయ వాదులకు, కోర్ట్ సిబ్బందికి మట్టితో చేసిన విగ్రహాలను పంపిణీ చేశారు.



శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY



## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎస్వీ విజయ మనోహరి



కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఊరేగింపు కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళావిభాగంవర్కింగ్‌ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగింది. కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుడి నామస్మరణతో ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

## పారామెడికల్ విద్యార్థులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా

### - తిరుపతి ఎంపీ గురుమూర్తివిద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



తిరుపతి, సెప్టెంబర్ 12(శ్రీచక్ర): హక్కుగా రావాల్సిన స్టైఫండ్‌ను చెల్లించాలని, తమ చదువులు సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతిలోని అలిపిరి వద్ద నిరసన చేపట్టిన పారామెడికల్ విద్యార్థులపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి పాదాల చెంత అలిపిరి వద్ద పారామెడికల్ విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన చేపట్టారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి గొంతును అణచివేసేందుకు పోలీసులతో దాడులు చేయించడం అత్యంత బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యార్థినుల జుట్టు పట్టుకుని నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లిన దృశ్యాలు మనసున్న ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయని అన్నారు. విద్యార్థులను పోలీసులు చితకబాదిన తీరు చూసి తన మనసు వేదనతో బరువెక్కిందని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు చెల్లించాలని రైతులు రోడ్డెక్కితే పోలీసులతో దాడులు చేయించడం చూశామని, ఇప్పుడు తమ హక్కుల కోసం ప్రశ్నించిన విద్యార్థులపై కూడా అదే విధంగా అమానవీయంగా వ్యవహరించడం దారుణమన్నారు. విద్యార్థుల సమస్యలను చర్చించి పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి పట్ల ఇంత కఠినంగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిని మరోసారి తీవ్రంగా ఖండిస్తున్నానని ఎంపీ గురుమూర్తి తెలిపారు. పారామెడికల్ విద్యార్థుల న్యాయమైన పోరాటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానని, ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు రావాల్సిన స్టైఫండ్‌ను చెల్లించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## జాతీయ లోక్ అదాలత్ లో భారీ కేసుల పరిష్కారం

సత్యవేడు, సెప్టెంబర్ 12( శ్రీచక్ర ):తిరుపతి జిల్లా,సత్యవేడు మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నందు న్యాయమూర్తి ఏ వెంకట నాగరాజు ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ లో 1295 కేసులు పరిష్కరించబడ్డాయి. శనివారం కోర్టు ఆవరణంలో నిర్వహించిన ఈ లోక్ అదాలకు విశేష స్పందన లభించింది. ఈ లోక్ అదాలత్ నందు 14 సివిల్ కేసులు , 1 ఆర్థిక నేరం కేసు, 65 క్రిమినల్ కేసులు, బ్యాంక్ పి ఎల్ సి లు 15, పెట్టి కేసులు ఇతర కేసులతో 1200 మొత్తం 1295 కేసులు ఇరుపక్షాల సమ్మతిమేరకు లోక్ అదాలత్ నియమ నిబంధనలకు లోబడి పరిష్కరించబడ్డాయి. ఈ లోకతల ద్వారా సుమారు సివిల్ అనగా భూ సంబంధిత కేసులలో సుమారు 14 లక్షల 31 వేలు విలువచేసే కేసు పరిష్కరించబడగా, ఆర్థిక నేరం కింద సుమారు 16 లక్షల నగదు జమయింది, బ్యాంక్ పి ఎల్ సి కింద సుమారు 11 లక్షల 75 వేల రూపాయల కేసు పరిష్కరించబడగా ఇతర కేసుల ద్వారా సుమారు నాలుగు లక్షల 84 వేల రూపాయలు నగదులు రికవరీ చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఏపీపీ లతా, కోర్టు మండల న్యాయశాఖ, కోర్టు అధికారులు, పలువురు సీనియర్ జూనియర్ లాయర్లు, బ్యాంక్ అధికారులు, పలువు రు కక్షదారులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న రైతులకు డబ్బులు చెల్లించకుండా మోసం

## సుమారు రూ.2 కోట్లు బకాయి.. దంపతుల అరెస్ట్

కర్నూలు, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): ఓర్వకల్లు మండలంలోని బ్రాహ్మణ పల్లె, కాల్వ తదితర గ్రామాలకు చెందిన రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, అందుకు సంబంధించిన డబ్బులు పూర్తిగా చెల్లించకుండా మోసానికి పాల్పడి నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దంపతులను ఓర్వకల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ఓర్వ కల్లు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 25/2026, సెక్షన్ 316(5) రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బేతంచర్ల గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాష, అతని భార్య షేక్ రిజ్వాన భాను లను శనివారం అరెస్ట్ చేసి, కర్నూలులోని జేఎం ఎఫ్‌సీ, స్పెషల్ మొబైల్ కోర్టు ఎదుట హాజ రుపరి చారు. ఈ కేసుకు సంబంధిం చిన వివరాలను శనివారం కర్నూలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో కర్నూ లు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఓర్వకల్లు ఎస్సై సునీల్ వెల్లడించారు.

**విచారణలో వెలుగు లోకి వచ్చిన అంశాలు:** విచారణలో షేక్ మహబూబ్ బాష రైతుల నుంచి సుమారు 88 లారీల





మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి, వ్యాపారస్తులైన యనబోతుల నాగమ్మ, ఆకుల శ్రీనివాసరావులకు సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ లావాదేవీలకు సంబంధించి షేక్ మహబూబ్ బాష, అతని భార్య రిజ్వాన భాను,వారిబంధువులకు చెందినహెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంకు ఖాతాల ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు.రైతులకు ఇప్పటివరకు సుమారు రూ.4 కోట్లు చెల్లించినప్పటికీ, మరో రూ.2 కోట్ల వరకు బకాయి ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.అలాగే ఆకుల శ్రీనివాసరావుకు చెందిన బ్యాంకు ఖాతా నుంచి రూ.5 కోట్లకు పైగా షేక్ మహబూబ్ బాష, రిజ్వాన భాను బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అయినట్లు గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. అందులో కొంత మొత్తాన్ని రైతులకు చెల్లించకుండా వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లువిచారణలోతేలినట్లు తెలిపారు.

**మరింత లోతుగా దర్యాప్తు:** నిందితుల బ్యాంకు ఖాతాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, మొత్తం ఎంత మేరకు ఆర్థిక లావాదేవీలు జరిగాయి, రైతులకు ఎంత మొత్తం బకాయి ఉంది, ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది అనే అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర తెలిపారు. దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## ఇంజరంలో ఘనంగా శ్రీ వరసిద్ధి గణపతి నవరాత్రి సేవా మహోత్సవాలు

ఇంజరం, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర): స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ పరాభవ నామ సంవత్సర భాద్రపద శుద్ధ చవితి సందర్భంగా ఇంజరం గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి గురుదత్త సాయి భక్తాంజనేయ మందిరంలో శ్రీ వరసిద్ధి గణపతి స్వామివారి నవరాత్రి సేవా మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ షిరిడి సాయి ధర్మ పరిషత్ నిర్వాహకులు, ప్రముఖ జ్యోతిష్యులు రామమూర్తి సిద్ధాంతి తెలిపారు. ఈ నవరాత్రి సేవా మహోత్సవాలు సెప్టెంబర్ 14 నుంచి సెప్టెంబర్ 22, 2026 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14న ఉదయం 9.15 గంటలకు కలశ స్థాపన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ శ్రీ వరసిద్ధి గణపతి స్వామివారికి అభిషేకం, అర్చన, నీరాజనం, మంత్రపుష్ప సేవలు ఉభయ సంధ్యల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. భక్తులు తమ గోత్రనామాలతో తొమ్మిది రోజుల పాటు స్వామివారి ప్రత్యేక సేవలు జరిపించుకునే అవకాశం కల్పించారు. అలాగే సెప్టెంబర్ 21న ఉదయం విశేష భస్మార్చన, సాయంత్రం విశిష్ట దీప సేవ నిర్వహించను న్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నవరాత్రి సేవా మహోత్సవాల్లో యావన్మంది భక్తులు పాల్గొని శ్రీ వరసిద్ధి గణపతి స్వామివారి కృపాకటాక్షాలు, ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సభ్యులు సర్వవిధాలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి.. కార్యకర్తలకు అండగా నిలబడతాం

## వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కాటసాని రామభూపాల్ రెడ్డి పిలుపు





గడివేముల,సెప్టెంబరు12 (శ్రీచక్ర):రాబోయేస్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు,పాణ్యంమాజీఎమ్మెల్యే కాటసాని రామ భూపాల్ రెడ్డిపిలుపునిచ్చారు.గడివేములమండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశానికి కాటసాని రామ భూపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు గుర్తింపు, గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో గుర్తింపుకార్డులను అందజేస్తున్నట్లు కాటసాని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచిఅన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా పోటీ చేయాలని ఆయన కోరారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం:** కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన ఏ ఒక్క నాయకుడు, కార్యకర్తను మర్చిపోమని కాటసాని స్పష్టం చేశారు. ప్రస్తుతం నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ నష్టాలకు భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అండగా నిలిచి న్యాయం చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తల విలువను తగ్గించబోమని అన్నారు. పార్టీలోని చిన్నచిన్న విభేదాలను నాయకులతో చర్చించి పరిష్కరించే బాధ్యత తానే తీసుకుంటానని తెలిపారు. ×రైతులపై కూటమి ప్రభుత్వానికి ప్రేమ ఎక్కడ?వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన సంక్షేమం, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలు బేరీజు వేసుకోవాలని కాటసాని అన్నారు. రైతుల నుంచి ఒక్క రూపాయి కమిషన్ తీసుకోకుండా వారి ప్రయోజనాల కోసం పనిచేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాటసాని విమర్శించారు.


**రాయలసీమ నీటి హక్కులపై రాజీలేని పోరాటం:** రాయలసీమకు రావాల్సిన సాగు, తాగునీటి వాటాను సాధించేందుకు వైఎస్సార్‌సీపీ రాజీలేని పోరాటం చేస్తుందని కాటసాని తెలిపారు. రాయలసీమ రైతులకు అన్యాయం చేసే విధంగా నీటి సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వెలుగోడు, శ్రీశైలం, పోతిరెడ్డిపాడు తదితర నీటి వనరుల నుంచి పాణ్యం, నంద్యాల ప్రాంతాలకు రావాల్సిన నీటిని సాధించేందుకు పార్టీ తరఫున నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు.

**టీడీపీ నాయకులకు కాటసాని హెచ్చరిక:** అధికారం ఎవరికీ శాశ్వతం కాదని కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు చేస్తున్న ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో ప్రజల తీర్పు మేరకు పరిస్థితులు మారుతాయని వ్యాఖ్యానించారు. అధికారులు, పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా తమ విధులను, ఉద్యోగ ధర్మాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే అధికారులు భవిష్యత్‌లో బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరిశ్రమల యాజమాన్యాలు, కాంట్రాక్టర్లు కూడా రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు, వారి పిల్లలకు రావాల్సిన హక్కులు, ఉద్యోగ అవకాశాల విషయంలో వివక్ష చూపకూడదని అన్నారు.

**జగన్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలి:** పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కాటసాని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. "ఈ కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో న్యాయం చేసే బాధ్యత నాదే" అని కాటసాని రామభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్.బీ. చంద్రశేఖర రెడ్డి, వైస్ ఎంపీపీ కాలు నాయక్, ఎంపీటీసీ మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు, దేశం నాగేశ్వర్ రెడ్డి, రఘు మాధవరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, పుల్లయ్య, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, రాము, గని ప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, దాలుస్వామి, కృష్ణారెడ్డి, స్వామి రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, గోదా ప్రసాద్, గోపాలయ్య, సుబ్బారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, రమేష్, బాలాచెన్నీ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

### బాణసంచా కాల్చి. కేక్ కట్ చేసి. స్వీట్లు పంచిన అభిమానులు



పుత్తూరు,సెప్టెంబర్,12(శ్రీ చక్ర)పుత్తూరు: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను శనివారం పుత్తూరులోని వారి స్వగృహంలో అభిమానులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం దంపతులను దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఎమ్మెల్యే దంపతుల దాంపత్య జీవితం నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం మండలం భీమునిచెరువు గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు కే. సుధాబాబు, దొంగేలి ఆర్ముగం, స్థానిక పెద్దలు నొచ్చిలి మణి, నడ్డి సుబ్రమణ్యం, ఎరికంబట్టు మణి, లక్షిణి మారయ్య, కె. సర్భమ్ గోవిందరాజులు, బాలిగాని మురుగేశం, కన్నెప్ప, రమేష్, చీరాలయ్య, సుందర రాజు, ఎం. నారాయణస్వామి, వెంకటేష్, బాలాజీ, మోహన్, శ్రీరాములు, కె. మునస్వామి, సందీప్, సంతోష్, జయశంకర్, దొంగేలి వెంకటేష్, నడ్డి వేదాచలం తదితరులతో పాటు పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు. హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దంపతులకు హృదయపూర్వక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు. మీ దాంపత్య జీవితం ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో, ప్రేమానురాగాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదుగుతూ, ప్రజల ఆశీస్సులతో చిరకాలం సేవలందించాలని కోరుకుంటున్నాను. ప్రత్యేక వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నమీ అభిమాని ? మైక్ నంద



## కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏరియా ఆసుపత్రిలో నిరసన. నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకుని బ్లాక్ బెలూన్స్ తో నిరసన వ్యక్తం






రామచంద్రపురం, సెప్టెంబర్ 12( శ్రీచక్ర)కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని , తమ డిమాండ్ల సాధన కోసం రోజుకో వినూత్న రీతిలో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దాసిల్వారీగా చేస్తున్న ఈ నిరసనలో భాగంగా నోటికి నల్ల రిబ్బన్స్ కట్టుకుని బ్లాకు బెలూన్స్ ఎగరేసి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో తమ డిమాండ్ల కోసం ప్రతి రోజు ఏదో ఒక రకంగా తమ నిరసన ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్లో పని చేస్తున్న షకీనా , విజయ్ , శ్రీనివాసు, రాంబాబు,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ లో 176 కేసులు పరిష్కారం.





రామచంద్రపురం, సెప్టెంబర్ 12( శ్రీచక్ర)రామచంద్రపురం పట్టణంలోని 13వ అదనపు జిల్లా , సెషన్స్ కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 176 కేసులు పరిష్కారం అయ్యాయ ని 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి బి. హెచ్. వి. లక్ష్మీ కుమారి తెలిపారు. వీటిలో 27 సివిల్ కేసులు, 149 క్రిమినల్ కేసులు ఉ న్నాయన్నారు. వీటి విలువ రూ.కోటి ,69లక్షల,85వే ,117 రూపాయలు అన్నారు. తొలుత జడ్జి లక్ష్మీకుమారి కక్షిదారులు, న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనవసర వాయిదాలు కోర వద్దని రాజీమార్గమే మేలని తద్వారా కేసులు సత్వర పరిష్కారం కావడమే కాక వాది, ప్రతివాదులు కూడా ఈ రాజీమార్గం ద్వారా గెలిచినట్టేనని ఆమె అన్నారు. పట్టుదలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో కేసులు పరిష్కరించుకో వాలని ఆమె సూచించారు. కోర్టులకు వచ్చిన కక్షిదారులకు మధ్యాహ్నం భోజన సదుపాయం ఆమె ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎం. వంశీకృష్ణ, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు, లోక్ అదాలత్ ప్యానల్ న్యాయవాదులు బొడ్డపాటి సురేష్ కుమార్, బీ.వీ. కామేశ్వరరావు, కలిదిండి కిరణ్ కుమార్, లోక్ అదాలత్ సిబ్బంది టి సుభాషిని, పిల్లి వాసు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు

## డి ఎ లు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ యు టీ యఫ్ నాయకులు



మార్కాపురం సెప్టెంబర్ 12 (శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు షేక్ ఖాజా రహంతుల్లా అధ్యక్షతన మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. బాధ్యతలు– హక్కులు రెండు నేత్రాలుగా యు టీ యఫ్ఉ పాధ్యాయ బృందం ఎప్పుడూ పనిచేస్తుందని నినదించారుముఖ్య అతిథిగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు గమాట్లాడుతూ ఇటీవల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన పరిణామాలు వివరిస్తూ వెంటనే పిఆర్సి కమిటీ నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. 2 ఆంలు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు అలాగే ఈ రెండు ఆంలు ఈ సెప్టెంబర్ నుండి అమల్లోకి వచ్చినా డి ఎ. బకాయిలు మాత్రం 2027 జనవరి నుండి 2028 జూలై వరకు విడతల వారీగా చెల్లిస్తామనడం సరికాదన్నారు పెన్షనర్స్ కు సంబంధించిన క్వాంటం పునరుద్ధరణ ఉత్తర్వులు వెంటనే.విడుదల.చేయాలన్నారు. అలాగే సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరారు. విద్యాహక్కు చట్టం 33వ క్లాసు (1) సవరించాలనీ, ఏ సబ్జెక్టులో బోధించే వారికి ఆ సబ్జెక్టులోనే పరీక్ష నిర్వహించాలని, అర్హత మార్కులకు తగ్గించాలని, ఆఫ్లైన్లోనే పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ వి. వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యూటీఎఫ్ సంఘంలో సభ్యుడై, సంక్షేమ పథకంలో సభ్యుడై చనిపోతే ఆ ఉపాధ్యాయ కుటుంబానికి తక్షణమే 2లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని , మార్కాపురం జిల్లా ఉపాధ్యాయుల అందరి పిఎఫ్ స్లిప్పులు అన్ని 2026 మార్చి వరకు అప్డేట్ చేసి వెంటనే మండల విద్యాశాఖ అధికారులు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు పంపాలన్నారు .మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు ఆలస్యం లేకుండా వెంటనే మంజూరు చేసి రిమ్స్ అధికారులు పంపాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న ప్రతి మండలం నుండి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు. మార్కాపురం జిల్లా గౌరవ అధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, రా. ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి. శ్రీరాములు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ దయ క్షమ సేవకు ప్రతిరూపమే యేసుక్రీస్తు.

### ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో నడుద్దాం
### రాక్ చర్చి ఉపవాస ప్రార్థనల ముగింపు సమావేశంలో సత్యం





రామచంద్రపురం, సెప్టెంబర్ 12( శ్రీ చక్ర)ప్రేమ, దయ ,క్షమ , సేవకు ప్రతిరూపమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. ఈ మేరకు శనివారం రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో గల రాక్ చర్చి ప్రాంగణంలో బిషప్ కె. ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉ పవాస ప్రార్థనల ముగింపు సమావేశంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, దయ, క్షమ, త్యాగం వంటి గొప్ప విలువలను ప్రపంచానికి అందించిన మహోన్నతుడు యేసుక్రీస్తు అని కొనియాడారు. యేసు తనను ప్రేమించిన వారినే కాదు, తనను హింసించిన వారిని సైతం ప్రేమించి క్షమించిన గొప్ప వ్యక్తిత్వమని పేర్కొన్నారు.సిలువపై బాధలు అనుభవిస్తూ కూడా తండ్రీ, వీరిని క్షమించుము వీరు ఏమి చేయుచున్నారో వీరికి తెలియదు అని ప్రార్థించిన యేసుక్రీస్తు క్షమాగుణానికి ప్రపంచంలోనే అత్యున్నత ఉదాహరణగా నిలిచారని పేర్కొన్నారు. పేదలు, బలహీనులు, అనాథలు, బాధితుల పట్ల యేసు చూపిన కరుణ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చెప్పారు. సమాజంలో వెనుకబడిన వారిని ఆదుకోవడం, అవసరంలో ఉ న్నవారికి అండగా నిలవడం నిజమైన మానవత్వమని తెలిపారు. సేవే నిజమైన నాయకత్వమని యేసు తన జీవితంతో నిరూపించారని, ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి నాయకుడు ఆయన బోధనలను ఆచరించాలని సూచించారు. జీవితంలో ఎన్నో కష్టాలు, పరీక్షలు ఎదురైనా విశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని యేసుక్రీస్తు బోధించారని పేర్కొన్నారు. ప్రేమ, దయ, క్షమ, సేవ, త్యాగం వంటి విలువలు మన జీవితాల్లో చోటు చేసుకున్నప్పుడే సమాజం మరింత శాంతియుతంగా, సుభిక్షంగా మారుతుందని అన్నారు.అలాగే నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరియు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమమే తమ లక్ష్యమని, సామాజిక సేవ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు సామాజిక, ఆర్థిక, సేవా కార్యక్రమాల ద్వారా నిరంతరం అండగా నిలుస్తున్న వాసంశెట్టి సత్యంను చర్చి నిర్వాహకులు, సంఘ పెద్దలు ఘనంగా సత్కరించి అభినందించారు.అనంతరం జరిగిన ప్రేమ విందు కార్యక్రమంలో సంఘ సభ్యులు, విశ్వాసులు నాయకులు, యువతతో కలిసి పాల్గొని ఆత్మీయంగా సత్యం మమేకమయ్యారు.

# వైసీపీ విజయమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేయాలి

### కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
### స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులకు దిశనిర్దేశం
### మాజీ రాజ్యసభ సభ్యులు సుభాష్ చంద్రబోస్





రామచంద్రపురం, సెప్టెంబర్ 12( శ్రీచక్ర)రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆయన తనయుడు రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ , స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ, గ్రామ–వార్డు స్థాయిలో పార్టీ బలోపేతంపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశించారు . అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఐడి కార్డులను మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, వాటిని కార్యకర్తలకు అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ తెలిపారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గ పరిశీలకులు కర్రి నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రత్యర్థి పార్టీల రాజకీయ వ్యూహాలు, ఎన్నికల సమయంలో ఎదురయ్యే పరిణామాలపై జాగ్రత్తగా వ్యవహరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తు చేసుకోవాలని బోస్ సూచించారు. రెండున్నర ఏళ్ళు గడిచిన తర్వాత ప్రస్తుత పెన్షన్లు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారని అయితే మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పెన్షన్లు మించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వలేరని ఆయన స్పష్టం చేశారు. గత రెండున్నర ఏళ్ల కాలంలో చనిపోయిన వారి పెన్షన్లు భర్తీ చేయకుండా ఇప్పుడు అవే పెన్షన్లు ఇచ్చేందుకు సిద్ధపడుతుందని బోస్ స్పష్టం చేశారు. ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు, ఎరువుల ధరల పెరుగుదల, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానంతో పాటు ప్రజల జీవితాలనుప్రభావితం చేసే అంశాల్లో ప్రభుత్వ వైఖరిని ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండలాల కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలను నిబంధనల మేరకు నిర్వహించాలి. -జీలుగుమిల్లి ఎస్ ఐ క్రాంతి కుమార్





జీలుగుమిల్లి సెప్టెంబర్ 12 (శ్రీచక్ర),వినాయక ఉత్సవాలను నిబంధనల మేరకు నిర్వహించాలని ఎస్ ఐ వి. క్రాంతి కుమార్ వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఆదేశించారు.మండలం లోని పి.అంకంపాలెం గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో అవగాహన సదస్సు ను ఏర్పాటు చేశారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఉత్సవాలలో పాటించవలసిన నియమాలను,తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు.వినాయక ఉత్సవాలు ఆరంభం నుంచి ముగింపు వరకూ ఎటువంటి అవంచనీయ సంఘటనలు జరుగకుండా కమిటీ చూసుకోవాలన్నారు.అదేవిధంగా ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి అశ్లీల నృత్యాలు, అల్లర్లు లాంటివి జరిగితే కమిటీ నిర్వాహకుల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినాయక నిమజ్జనం సమయం లో కూడ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు..వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కై ఆర్య వైశ్య సంఘం ప్రెసిడెంట్ కక్కిరాల ఉపేంద్ర,కోరుకొండ సూరిబాబు ల అధ్వర్యంలో పలువురికి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా వినాయక చవితి సంప్రదాయాన్ని కొనసాగించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.

## వాల్తేరు డిపో వద్ద ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధం

విశాఖపట్నం:విశాఖ నగరంలో శనివారం తెల్లవారుజామున ఒక భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది నెల్లూరు నుంచి ప్రయాణికులతో విశాఖ పట్నం చేరుకున్న ఒక ఏపీఎస్ఆర్టీసీ (ఒఖూఖీఅ) బస్సు వాల్తేరు డిపో సమీపంలో నిలిపి ఉంచగా ఆకస్మాత్తుగా మంటలు అంటుకుని నిమిషాల వ్యవధిలోనే పూర్తిగా దగ్ధ మైంది నెల్లూరు నుంచి సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఈ బస్సు విశాఖకు చేరు కుంది అనంతరం వాల్తేరు డిపో వెలుపల బస్సును నిలిపి ఉంచారు అయితే, శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా బస్సు ఇంజిన్ భాగం నుండి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించాయి. బస్సు ఖాళీగా ఉన్న సమ యంలోనే ఈ ప్రమాదం జరగడంతో ఒక పెద్ద ముప్పు తప్పింది నిమిషాల వ్యవధిలోనే మంటలు బస్సు మొత్తానికి విస్తరించి వాహనం పూర్తిగా దగ్ధం అయ్యింది బస్సు తగల బడుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు సిబ్బంది వెంటనే పోలీసుల్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు ఆర్టీసీ ఉన్నతాధి కారులు,పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీ లించారు బస్సులో మంటలు చెలరేగడానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేదా మరేదైనా సాంకేతిక లోపమా అనే కోణంలో పోలీసులు ఆర్టీసీ సాంకేతిక విభాగం అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఈ ప్రమాదం లో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం తో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# 'గణపతి నవరాత్రుల' సన్నాహక సమీక్షా సమావేశం

## సింగిల్ విండో అనుమతితోనే మండపాల ఏర్పాటు - ఆర్డీఓ




రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (శ్రీచక్ర)వినాయక చవితి, నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో మండల, డివిజన్ స్థాయి అధికారులు గణేష్ ఉ త్సవ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఈనెల 10న జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆర్డీవో, రామచంద్రపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కలసి ఈ సమావేశంలో కీలక సూచనలు చేశారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా సింగిల్ విండో విధానం ద్వారా ముందస్తు అనుమతి పొందిన తర్వాతే విగ్రహాలను నెలకొల్పాలన్నారు. నిబంధనలకు మించి సౌండ్ సిస్టమ్‌లు వాడకూడదని, ఊరేగింపుల్లో డిజేల వినియోగాన్ని సంపూర్ణంగా నిషేధించడం జరిగిందన్నారు.ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నియంత్రించి, సహజసిద్ధమైన వస్తువులను వాడాలని, రసాయన విగ్రహాలకు స్వస్తి చెప్పి మట్టి విగ్రహాలనే ప్రతిష్టించాలన్నారు. 5 అడుగుల కంటే ఎత్తైన విగ్రహాలను ప్రతిష్టించేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ మండపాల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై ప్రజా రవాణాకు ఆటంకం కలిగించేలా, జనసాంద్రత ఎక్కువ ఉండే ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేయరాదని, ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.మండపాల వద్ద ఎలక్ట్రికల్ వైరింగ్ సురక్షితంగా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ఉత్సవ కమిటీలకు అవసరమైన సూచనలు అందించాలని సూచించారు.నిమజ్జనం సమయంలో క్రేన్ల వినియోగానికి అధికారులకు సహకరించాలని కోరారు.నిమజ్జన ఘాట్ల వద్ద అవసరమైన లైటింగ్, బారికేడింగ్ ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శులు పూర్తి చేయాలన్నారు.ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, రామచంద్రపురం సర్కిల్ ఇన్స్పెక్టర్, రామచంద్రపురం, ద్రాక్షారామ, కె.గంగవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ ఏఈలు, కోటిపల్లి హెడ్ వర్క్స్ ఏఈ, రామచంద్రపురం మండల పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# అల్పాహారంగా మొలకెత్తిన గింజలను తింటున్నారా?



మొలకెత్తిన గింజలు పోషక విలువలతో నిండిన ఆహారం. వీటిని ఆరోగ్యానికి ఒక అద్భుతమైన ఆహారంగా తీసుకుంటాం. ఇవి విటమిన్ అ, ఐ, ః, మినరల్స్, ప్రోటీన్లు, ఫైబర్‌లకు గొప్ప మూలం. ప్రాసెస్ సమయంలో గింజలలోని పోషకాలు పెరిగి, తేలికగా జీర్ణమయ్యే విధంగా మారతాయి. అల్పాహారంగా మొలకెత్తిన గింజలు తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, అతిగా తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉండవచ్చు. మొలకెత్తిన గింజలతో ప్రయోజనాలు: మొలకెత్తిన గింజల్లో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ సి, విటమిన్ కె, ఫోలేట్, ఇనుము వంటివి ఎక్కువగా ఉంటాయి. వీటిల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. మొలకెత్తిన గింజల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అతిగా తినడం నిరుత్సాహపడుతుంది. మొలకెత్తిన గింజల్లో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచే మరియు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మొలకెత్తిన గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ముడతలు, మచ్చలు వంటి సమస్యలను తగ్గిస్తుంది. ంశ్రీబనీ ఖీవజీట "రోజూ బ్రేక్‌ఫాస్ట్‌గా ఓట్స్ తింటున్నారా? ఈ వార్నింగ్ మీకోసమే.!" దుష్ప్రభావాలు: కొంతమందికి మొలకెత్తిన గింజలకు అలర్జీ ఉండవచ్చు. అలర్జీ ఉన్నవారు మొలకెత్తిన గింజలు తినడం వల్ల చర్మం దురద, ఉబ్బరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు. అతిగా మొలకెత్తిన గింజలు తినడం వల్ల కొంతమందికి జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒకే రకమైన మొలకెత్తిన గింజలను అధికంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఇతర పోషకాలు లభించకపోవచ్చు. మొలకెత్తిన గింజలను శుభ్రంగా కడగకపోతే బ్యాక్టీరియా సంక్రమణ వచ్చే అవకాశం ఉంది. తీసుకోవాల్సిన జాగ్రత్తలు. మొలకెత్తిన గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, అతిగా తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉండవచ్చు. అందుకే, మితంగా తీసుకోవడం మంచిది. మొలకెత్తిన గింజలను తినే ముందు శుభ్రంగా కడగాలి. ప్రారంభంలో తక్కువ మొత్తంలో మొలకెత్తిన గింజలు తీసుకొని క్రమంగా పెంచుకోవాలి. ఒకే రకమైన మొలకెత్తిన గింజలను మాత్రమే తినకుండా, వివిధ రకాల మొలకెత్తిన గింజలను తీసుకోవడం మంచిది. అలర్జీ ఉన్నవారు మొలకెత్తిన గింజలను తీసుకోవడానికి ముందు వైద్యుని సలహా తీసుకోవాలి.

# పచ్చ పెసల గొప్పతనం తెలిస్తే మీ డైట్‌లో చేర్చుకోకుండా ఉండలేరు.!

పచ్చ పెసలు  భారతీయ ఆహార సంస్కృతిలో ముఖ్యమైన భాగంగా ఉంటాయి. ఇవి రుచికరమైన ఆహారమే కాదు, ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయి. ప్రోటీన్లు, పీచు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలం. ఇవి శరీరానికి సమగ్ర పోషణను అందిస్తాయి. న్యూట్రిషన్‌తో నిండిన ఆహారంగా, ఆరోగ్యకరమైన జీవితానికి ఎంతో దోహదపడతాయి. పచ్చ పెసలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించవచ్చు 1. ప్రోటీన్ సమృద్ధి :పచ్చ పెసలు ప్రోటీన్ యొక్క సమృద్ధి శ్రోత. ఇది శరీర కణాల నిర్మాణం, మరమ్మతులకు ఉపయోగపడుతుంది. మాంసాహారాన్ని తీసుకోని వాళ్లకు ప్రోటీన్ అవసరాలను తీర్చడానికి ఇది ఉత్తమమైన ఆహారంగా పనిచేస్తుంది."రోజూ బ్రేక్‌ఫాస్ట్‌గా ఓట్స్ తింటున్నారా? ఈ వార్నింగ్ మీకోసమే.!"2. జీర్ణశక్తిని పెంచుతుంది :పచ్చ పెసలలో అధికంగా ఉండే పీచు జీర్ణవ్యవస్థను శుభ్రపరచి, మంచి జీర్ణక్రియకు దోహదం చేస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గించడానికి పచ్చ పెసలు ఉపయోగపడతాయి. 3. బరువు నియంత్రణ :పచ్చ పెసలు తేలికగా జీర్ణమయ్యే ఆహారం. ఇవి తక్కువ క్యాలరీలు కలిగి ఉండటంతో బరువు తగ్గించుకోవాలనుకునే వారి ఆహారంలో పచ్చ పెసలను చేర్చవచ్చు. ఇవి ఆకలి తగ్గించి, తృప్తిని కలిగిస్తాయి. 4. గుండె ఆరోగ్యం :పచ్చ పెసలలో పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉండటం వల్ల ఇవి గుండెకు చాలా మంచివి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో, చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల రిస్క్ తగ్గుతుంది. పొట్లకాయ తిన్న వెంటనే గుడ్లు, పెరుగు తింటే ఏమవుతుంది? 5. డయాబెటిస్ నియంత్రణ:పచ్చ పెసలు గ్లైసేమిక్ ఇండెక్స్ తక్కువగా కలిగి ఉంటాయి. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. డయాబెటిస్ ఉన్నవారు పచ్చ పెసలను తీసుకోవడం ద్వారా గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంచవచ్చు. 6. చర్మానికి మెరుగైన ఆరోగ్యం :పచ్చ పెసలలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి చర్మానికి మిలమిలలును అందిస్తాయి. పచ్చ పెసల ముద్దను ముఖానికి పూస్తే మొటిమలు, చర్మపు ముడతలు తగ్గుతాయి. ఇది సహజమైన ఫేస్ ప్యాక్‌గా పనిచేస్తుంది. 7. శక్తి పెంపు:పచ్చ పెసలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇవి తినడం ద్వారా అలసట తగ్గి శక్తి నింపబడుతుంది. రోజువారీ దినచర్యల్లో శక్తివంతంగా ఉండటానికి ఇవి మంచి ఆహారంగా పనిచేస్తాయి."ఊదలు తింటే ఊబకాయం పరార్!.. ఇలా ట్రై చేస్తే చాలు..!"8. ఎముకల బలానికి :పచ్చ పెసలలో కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉన్నందువల్ల ఇవి ఎముకల బలానికి సహాయపడతాయి. ఇది ఆస్టియోపోరోసిస్ వంటి ఎముక సమస్యల రిస్కును తగ్గిస్తుంది. 9. రోగనిరోధక శక్తి పెంపు :పచ్చ పెసలలో ఉండే విటమిన్ అ మరియు ఇతర యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇది శరీరాన్ని వివిధ రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా సంక్రమణల నుంచి కాపాడుతుంది. 10. గర్భిణీ స్త్రీలకు అనుకూలం :గర్భిణీ స్త్రీల కోసం పచ్చ పెసలు మంచి ఆహారంగా పరిగణించబడతాయి. ఇవి ఐరన్ మరియు ఫోలేట్‌ను అందిస్తాయి, ఇవి గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యం కోసం చాలా ముఖ్యమైనవి. పచ్చ పెసలు వంటలో వినియోగంపచ్చ పెసలను మొలకెత్తిన రూపంలో లేదా ఉడికించిన రూపంలో తీసుకోవచ్చు. పెసర పప్పు, పెసరట్టు, పెసలతో కూరలు , సలాడ్లు వంటి వివిధ రకాలుగా వీటిని ఆహారంలో చేర్చుకోవచ్చు. పిండి లాంటి పదార్థాలకు పచ్చ పెసలు మిశ్రమంగా చేస్తే ఆరోగ్యకరమైన ఆహారంగా మారుతుంది.



# పచ్చిగా తినకూడని ఆహారాలు ఇవే.. పొరపాటున తిన్నారో మీ పని అంతే!

ప్రతిరోజూ మనం తినే ఆహారంలో కొన్ని పదార్థాలను పచ్చిగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ఇవి జీర్ణ సమస్యలు, ఆహార విషప్రయోగం వంటి అనేక సమస్యలకు కారణమవుతాయి. వీటిని ఉడికించడం లేదా ప్రాసెస్ చేయడం అవసరం. పచ్చిగా తినకూడని ముఖ్యమైన ఆహారాలు , వాటి ప్రభావాల గురించి వివరంగా తెలుసుకుందాం. 1. పచ్చి గుడ్లు : పచ్చి గుడ్లలో సెల్మోనెల్లా అనే బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. ఇది ఆహార విషప్రయోగానికి దారితీస్తుంది. సాల్మోనెల్లా బ్యాక్టీరియా వల్ల జ్వరం, పొట్ట నొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించవచ్చు. గుడ్లను సరైన ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం ద్వారా ఈ ప్రమాదాన్ని నివారించవచ్చు. ంశ్రీబనీ ఖీవజీట "రోజూ బ్రేక్‌ఫాస్ట్‌గా ఓట్స్ తింటున్నారా? ఈ వార్నింగ్ మీకోసమే.!" 2. పచ్చి మాంసం: పచ్చి మాంసంలో పరాన్నజీవులు ఉండే అవకాశం ఉంది. ఇవి జీర్ణవ్యవస్థకు హాని కలిగిస్తాయి. పచ్చి మాంసం తినడం వల్ల టేప్‌వార్మ్‌లు, రౌండ్‌వార్మ్‌లు వంటి పరాన్నజీవులు శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంటుంది. పచ్చి చేపల్లో పారా సైట్స్ , బాక్టీరియా ఉండే అవకాశం ఉంది. ఈ ఆహారం సరైన విధంగా ఉడికించకపోతే జీర్ణ సమస్యలు, ఆహార విషప్రయోగం జరుగుతంది. 3. ముల్లంగి, పనసకాయలు : ఈ కూరగాయల్ని పచ్చిగా



తినడం వల్ల గ్యాస్ , కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి. ముల్లంగిలో గోయిట్రోజెన్స్ అనే పదార్థం ఉంటుంది, ఇది థైరాయిడ్ పనితీరును దెబ్బతీస్తుంది. 4. పచ్చి ఆలూ, టమోటాలు: అన్నింటికీ అంతగా కనిపించని సొలానిన్ అనే టాక్సిన్ పచ్చి ఆలూ, పచ్చి టమోటాల్లో ఉంటుంది. ఇది నరాల సమస్యలు, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలకు కారణమవుతుంది.  "పొట్లకాయ తిన్న వెంటనే గుడ్లు, పెరుగు తింటే ఏమవుతుంది?" 5. పచ్చి బీన్స్: పచ్చిగా తినే బీన్స్ లేదా కడలిపప్పు హైడ్రోజనిక్ యాసిడ్ కలిగి ఉండే అవకాశం ఉంది. పచ్చి బీన్స్ తినడం వల్ల వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. పప్పులను చక్కగా ఉడికించి తీసుకోవడం మంచిది. 6. పాలకూర : పచ్చి పాలకూరలో ఆక్సలేట్ ఎక్కువగా ఉంటుంది. ఇది కిడ్నీ రాళ్లను , మలబద్ధకాన్ని కలిగిస్తుంది. దీనిని తగిన విధంగా వండుకోవడం లేదా ఉడికించుకోవడం ద్వారా మేలవుతుంది. 7. పప్పు గింజలు : కొన్ని రకాల గింజలు పచ్చిగా తింటే అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే, కొన్ని గింజలలో యాంటీన్యూట్రియెంట్స్ ఉంటాయి. ఇవి శరీరం ఆహారాన్ని సరిగ్గా శోషించుకోకుండా నిరోధిస్తాయి.'ఖాళీ కడుపుతో జీడిపప్పు తింటున్నారా? " ఎందుకు పచ్చిగా తినకూడదు? పచ్చి ఆహారంలో హానికరమైన బ్యాక్టీరియా ఉండే అవకాశం ఎక్కువ. ఈ బ్యాక్టీరియా వల్ల ఆహార విషం, జ్వరం, విరేచనాలు వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. పచ్చి మాంసం, చేపల్లో పరాన్నజీవులు ఉండే అవకాశం ఉంది. ఈ పరాన్నజీవులు శరీరంలోకి ప్రవేశించి అనేక రకాల అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి. కొన్ని ఆహార పదార్థాలలో విషపదార్థాలు ఉంటాయి. ఈ విషపదార్థాలు పచ్చిగా తింటే శరీరానికి హాని కలిగిస్తాయి. కొన్ని ఆహార పదార్థాలను పచ్చిగా తింటే జీర్ణవ్యవస్థ సరిగ్గా పనిచేయదు. దీని వల్ల వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయి. జాగ్రత్తలు: పచ్చిగా తినకూడని ఆహారాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ఈ ఆహారాలను తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే, ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారాన్ని సరిగ్గా ఉడికించి తినడం చాలా ముఖ్యం. కూరగాయలు, ఇతర పదార్థాలను తినే ముందు సరైన రీతిలో శుభ్రపరచడం ముఖ్యం. ఆహార పదార్థాలను తగిన ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం ద్వారా టాక్సిన్లను తొలగించవచ్చు. గుడ్లు, చేపలు, మరియు మాంసం వంటి ఆహార పదార్థాలను సరైన విధంగా ఉడికించడం ఆరోగ్యానికి చాలా మంచిది.

# పచ్చి పాలు ఎందుకు తాగకూడదో తెలుసా..?

పచ్చి పాలు అంటే పాశ్చరైజేషన్ ప్రక్రియకు గురికాని పాలు. అంటే వేడి చేయకుండా నేరుగా పశువు నుండి పితికే పాలు. కొంతమంది ఈ పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని నమ్ముతారు. అయితే, పచ్చి పాలు తాగడం వల్ల కలిగే ప్రమాదాల గురించి కూడా తెలుసుకోవడం ముఖ్యం. పచ్చి పాల వల్ల కలిగే ప్రయోజనాలు (సాధారణ నమ్మకాలు) అధిక పోషకాలు: పాశ్చరైజేషన్ ప్రక్రియలో కొన్ని పోషకాలు నాశనమవుతాయి. కాబట్టి పచ్చి పాలలో పాశ్చరైజ్డ్ పాల కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయని నమ్ముతారు. ముఖ్యంగా విటమిన్లు మరియు ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయని భావిస్తారు. " శృంగారం తర్వాత అందరు చేసే తప్పులు ఇవే..!" ప్రతిరోధక శక్తి పెరుగుదల: పచ్చి పాలలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను మెరుగుపరచి, రోగ నిరోధక శక్తిని పెంచుతాయని నమ్మకం. ఎముకల ఆరోగ్యం: పచ్చి పాలలో కాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకలను బలపరుస్తుందని భావిస్తారు. ఆటో ఇమ్యూన్ వ్యాధుల నివారణ: కొందరు పచ్చి పాలలో ఉండే కొన్ని పదార్థాలు ఆటో ఇమ్యూన్ వ్యాధులను నివారిస్తాయని నమ్ముతారు. పచ్చి పాలు తాగడం వల్ల కలిగే ప్రమాదాలు పచ్చి పాలలో సాల్మోనెల్లా, ఈ.కోలి, లిస్టీరియా వంటి హానికరమైన బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. ఈ బ్యాక్టీరియా వల్ల ఆహార విషం, గర్భస్రావం, మెదడు వాపు వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. పచ్చి పాల ద్వారా కొన్ని వైరస్‌లు కూడా వ్యాపించే అవకాశం ఉంటుంది. పాశ్చరైజేషన్ ప్రక్రియ ద్వారా పాలలో



ఉండే హానికరమైన జీవులు నాశనమవుతాయి. పచ్చి పాలు తాగడం వల్ల ఈ జీవులు శరీరంలోకి ప్రవేశించి అనారోగ్య సమస్యలకు కారణమవుతాయి. ముఖ్యమైన విషయం: పచ్చి పాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి అధికారికంగా నిరూపించబడిన శాస్త్రీయ ఆధారాలు చాలా తక్కువ. అయితే, పచ్చి పాలు తాగడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అనేక అధ్యయనాలు నిర్వహించబడ్డాయి. కాబట్టి ఆరోగ్య నిపుణులు పచ్చి పాలు తాగడానికి సలహా ఇవ్వరు. పచ్చి పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాల కంటే ప్రమాదాలే ఎక్కువ. కాబట్టి ఆరోగ్యం కోసం పాశ్చరైజ్డ్ పాలను తాగడమే మంచిది. ఏదైనా సందేహం ఉంటే మీ వైద్యుడిని సంప్రదించండి.

# ఖాళీ కడుపుతో జీడిపప్పు తింటున్నారా?

జీడిపప్పులు పోషకాల గని. వీటిలో ప్రోటీన్లు, ఫైబర్, మంచి కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఖాళీ కడుపుతో జీడిపప్పులు తినడం వల్ల శరీరానికి అనేక రకాలుగా లాభాలు చేకూరుతాయి. అయితే, ఏదైనా ఆహారాన్ని అధికంగా తీసుకోవడం వల్ల కూడా కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే, ఏదైనా ఆహారాన్ని తీసుకోవడానికి ముందు మీ వైద్యుని సలహా తీసుకోవడం మంచిది. ఆరోగ్య ప్రయోజనాలు జీడిపప్పులో ఉండే కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి త్వరిత శక్తిని అందిస్తాయి. ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల ఈ శక్తి మరింత త్వరగా అందుతుంది. దీనిలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి , చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జీడిపప్పులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అతిగా తినడం నిరుత్సాహపడుతుంది. దీంట్లో ఉండే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ఇవి ఎముకలను బలపరుస్తాయి. జీడిపప్పులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.  "రోజూ బ్రేక్‌ఫాస్ట్‌గా ఓట్స్ తింటున్నారా? ఈ వార్నింగ్ మీకోసమే.!" అంతే



కాకుండా జీడిపప్పులో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సామర్థ్యాన్ని పెంచుతుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిలోని ప్రోటీన్లు పుష్కలంగా ఉండటం వల్ల కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. జీడిపప్పులో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడతాయి. ప్రతి రోజు ఎన్ని జీడిపప్పులు తినాలి? సాధారణంగా, ఒక ఆరోగ్యవంతమైన వ్యక్తి రోజుకు 20-30 గ్రాముల జీడిపప్పులు తినవచ్చు. మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఈ మొత్తం మారవచ్చు. అయితే జీడిపప్పుకు అలర్జీ ఉన్నవారు జీడిపప్పును తీసుకోకూడదు. బరువు పెరగడానికి ప్రయత్నిస్తున్నవారు జీడిపప్పును అధికంగా తీసుకోకూడదు. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు జీడిపప్పును తీసుకోవడానికి ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. ఖాళీ కడుపుతో జీడిపప్పు తినడం వల్ల కడుపులో మంట లేదా అజీర్తి వచ్చే అవకాశం ఉంది. దీన్ని అధికంగా తీసుకోవడం వల్ల కొవ్వు పెరగడానికి దారితీస్తుంది. ఏదైనా ఆహారాన్ని తీసుకోవడానికి ముందు మీ వైద్యుని సలహా తీసుకోవడం మంచిది. ఖీవఞనీఎఎవనిటవట ఈనీతీ జనీబీ " లివర్ ఆరోగ్యాన్ని కాపాడే సూపర్ ఫుడ్స్ ఇవే! " ఖనీలివతీవట ఃఎ జీడిపప్పు ఆరోగ్యకరమైన ఆహారం. కానీ, ఏదైనా ఆహారాన్ని అధికంగా తీసుకోవడం వల్ల కూడా కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే, సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యం.



# స్పోర్ట్స్ న్యూస్

## సచిన్, రహానేకు మరో గౌరవం.. వాంఖడేలో ప్రత్యేక లాంజ్‌లు ఏర్పాటు..!



భారత మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్ అజింక్యా రహానేలకు మరో గౌరవం దక్కనుంది. దిగ్గజ ఆటగాళ్లుగా కితాబులందుకున్న వీరి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ముంబై క్రికెట్ సంఘం నిర్ణయించింది. టీమిండియాకు, ముంబై క్రికెట్‌కు విశేష సేవలందించినందున విశ్రాంతి గదులకు సచిన్, రహానే పేర్లను ఎంసీఏ ఖరారు చేసింది. వీరితో పాటు దివంగత మాధవ్ మంత్రి పేరుతోనూ లాంజ్ ఉంటుందని శుక్రవారం ఎంసీఏ తెలిపింది.ముంబై క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన వార్షిక సమావేశంలో మాజీ క్రికెటర్ల పేర్లను లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ఎంసీకే తీర్మానించింది. దేశవాళీలో ముంబైకి ఆడిన సచిన్ టెండూల్కర్, ఇటీవలే వీడ్కోలు పలికిన అజింక్యా రహానే.. ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత మాధవ్ మంత్రి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు పెట్టనుంది.సచిన్, రహానే, మాధవ్ పేర్లనే ఏ లాంజ్‌కు పెట్టాలి? వాటిని తీర్చిదిద్దేబాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీకి, కార్యదర్శులకు అప్పగించామని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు. ఎంసీఏ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్ ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఉన్నారు. వార్షిక సమావేశంలోనే అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ మొత్తంగా రూ.100 కోట్లు కేటాయించాలని ఎంసీఏ నిర్ణయించింది.

## ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత అవమానకర గోల్..



క్రీడల్లో అప్పుడప్పుడు జరిగే కొన్ని అరుదైన, విచిత్ర ఘటనలు మనల్నీ ఆశ్చర్యానికి గురి చేస్తాయి తాజాగా బ్రెజిల్ సెకండ్ డివిజన్ లీగ్‌లో జరిగిన ఓ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో కూడా వింత ఘటన చోటుచేసుకుంది. స్పోర్ట్ రెసిఫ్, నోవోరిజోంటినో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో.. ప్రత్యర్థి జట్టు బంతిని తాకకుండానే కేవలం నిమిషాల వ్యవధిలో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్పోర్ట్స్ రెసిఫ్ డిఫెండర్ చేసిన బ్యాక్ పాస్ కారణంగా ప్రత్యర్థికి గోల్ లభించింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.స్పోర్ట్ రెసిఫ్ జట్టు డిఫెండర్ అలీసన్ కాసియానో బంతిని తమ ఆధీనంలో ఉంచుకోవాలని భావించాడు. ఈ క్రమంలో సహచర ప్లేయర్లకు బంతిని పాస్ చేశాడు. మరికొద్ది సమయం తర్వాత తిరిగి అతడి వద్దకే బంతి వచ్చింది. ఈ క్రమంలో బంతిని గోల్‌కీపర్ క్రైక్ ఫ్రాంకాకు ఇవ్వాలని భావించాడు. అయితే కీపర్ సరైన స్థానంలో లేకపోవడంతో కాసియానో పాస్ చేసిన బంతి నేరుగా గోల్‌పోస్ట్‌లోకి వెళ్లి సెల్ఫ్ గోల్‌గా నమోదైంది. దీంతో బంతిని టచ్ చేయకుండానే ప్రత్యర్థి జట్టు నోవోరిజోంటినో ఖాతాలో ఒక గోల్ చేరింది. దీనికి సంబంధించిన వీడియోపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫుట్ బాల్ క్రీడా రంగంలో ఇది అత్యంత చెత్త గోల్ అని కొందరు తెలిపారు. ఇలాంటి జట్టు ఉంటే...ప్రత్యర్థి బంతిని టచ్ చేయకుండానే గెలవచ్చంటూ మరికొందరు రెసిఫ్ జట్టుపై సెటైర్లు వేస్తున్నారు.మరోవైపు, బ్రెజిల్ ఫుట్‌బాల్ గురించిన మరో ఆసక్తికరమైన వార్త భారతీయ క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తోంది. కోల్‌కతాలో జరగనున్న భారత్-బ్రెజిల్ చారిత్రాత్మక అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌పై ఫుట్‌బాల్ ప్రేమికులు అమితాసక్తి కనబరుస్తున్నారు. వివేకానంద యువ భారతి క్రీడాంగణం (ఎఙఃఐ) వేదికగా అక్టోబర్ 3న జరగనున్న ఈ మ్యాచ్‌కు సంబంధించిన తక్కువ ధర టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చిన గంటల వ్యవధిలోనే అమ్ముడయ్యాయి.

## ఇంగ్లండ్‌తో మూడో టెస్టు.. 9 సిక్సర్లు కొట్టిన పాక్ బ్యాటర్ రజావుల్లా



బర్మింగ్‌హామ్: పాకిస్థాన్ ఆల్‌రౌండర్ రజావుల్లా సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడవ టెస్టులో మూడో రోజు అతను పవర్ హిట్టింగ్ తడాఖా చూపించాడు. అరంగేట్రం టెస్టు ఆడుతున్న రజావుల్లా.. తొమ్మిదో నెంబర్ బ్యాటర్‌గా రెండో ఇన్నింగ్స్‌లో క్రీజ్‌లోకి దిగాడు. అసాధారణ రీతిలో 9 వికెట్‌కు అబ్బాస్‌తో కలిసి 121 రన్స్ జోడించారు. రజావుల్లా 63 బంతుల్లో 81 రన్స్ చేసి ఔటయ్యాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి. దీంతో పాకిస్థాన్ తన రెండో ఇన్నింగ్స్‌లో 449 రన్స్‌కు ఆలౌటైంది. ఇంగ్లండ్ గెలుపు కోసం 130 రన్స్ చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి మూడో రోజే పాకిస్థాన్ కుప్పకూలింది. కానీ అనూహ్య రీతిలో రజావుల్లా 9వ వికెట్ రూపంలో మెరుపులు మెరిపించాడు. భారీ సిక్సర్లతో ఆకట్టుకున్నాడు.రజావుల్లా హిట్టింగ్‌కు ఇంగ్లండ్ బౌలర్లు స్టన్ అయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు షాన్ మసూద్ 95, బాబర్ ఆజమ్ 76, అజన్ అవాయిస్ 59 రన్స్ చేశారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఓ సెంచరీ చేసిన రికార్డు ఉన్న రజావుల్లా.. ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 43 బంతుల్లో అతను హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లీడ్స్, లార్డ్స్‌లో జరిగిన టెస్టుల్లో పాకిస్థాన్ మరీ పేలవంగా ఆడింది. బర్మింగ్‌హామ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లోనూ 133 పరుగుల స్వల్ప స్కోరుకే చేతులెత్తేసింది. ఈ సిరీస్‌లో తొలిసారి పాక్ 200 స్కోరు దాటింది. తొలి రెండు టెస్టుల్లో ఘోర వైఫల్యం కావడంతో.. పాక్ జట్టు ఏకంగా ఏడుగురు సభ్యులను తొలగించింది.

## వైభవ్ లాంటి ప్లేయర్‌ను ఒక్కడినైనా తయారు చేశారా?: వసీం అక్రమ్



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీం అక్రమ్ ప్రశంసలు కురిపించాడు. ఈ క్రమంలో పాక్ క్రికెట్‌పై సంచలన విమర్శలు చేశాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. పీఎస్ఎల్‌ను ఐపీఎల్‌తో పోలుస్తూ.. యువ బ్యాటర్ల ప్రతిభను వెలికితీయడంలో పాకిస్థాన్ లీగ్ విఫలమైందని విమర్శించాడు.'పీఎస్ఎల్ ప్రారంభమై పదేళ్లు దాటింది. కానీ ఆ లీగ్ నుంచి ఒక్క బ్యాటర్ అయినా జాతీయ జట్టులోకి వచ్చాడా? కొంతమంది మంచి బౌలర్లను తయారు చేశాం. కానీ చెప్పుకోదగ్గ యువ బ్యాటర్లను ఎంత మందిని తయారు చేశాం? వైభవ్ సూర్యవంశీ లాంటి బ్యాటర్ మన దగ్గర నుంచి వచ్చినప్పుడే పాకిస్థాన్ క్రికెట్‌లోనూ మార్పు కనిపిస్తుంది. పాకిస్థాన్‌లో యువ ప్లేయర్ల ప్రతిభను వెలికి తీయాలంటే క్లబ్ క్రికెట్ వ్యవస్థను పునరుద్ధరించాలని. సుదీర్ఘ ఫార్మాట్‌లో పలు కీలక మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. కరాచీ, లాహోర్‌లో క్లబ్ క్రికెట్ అభివృద్ధికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఒక్కో నగరానికి రూ.10కోట్లు కేటాయించాలి. ఎందుకంటే అసలైన ప్రతిభ క్లబ్ క్రికెట్ నుంచే వస్తుంది' అని వసీం అక్రమ్ వెల్లడించాడు.పాకిస్థాన్ ప్రస్తుతం ఇంగ్లండ్‌తో మూడో టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇప్పటికే 2-0 తేడాతో సిరీస్ ఓడిన పాక్.. మూడో టెస్టులో కూడా ఓటమి అంచున నిలిచింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 449 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్‌కు 129 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మ్యాచ్‌లో కూడా ఓడితే పాక్.. ఇంగ్లండ్ చేతిలో వైట్ వాష్ అవుతుంది.

## భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ఇంట్లో విషాదం



భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. అతడి తండ్రి వి.శాంతకుమారన్ నాయర్(89) కన్నుమూశారు. అనారోగ్యంతో కొచ్చిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన.. శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన భౌతికకాయాన్ని ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. విదేశాల్లో ఉన్న బంధువులు రావాల్సి ఉండటంతో ఆదివారం మృతదేహాన్ని స్వగ్రామం కేరళలోని కోతమంగళానికి తరలించనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.శాంతకుమారన్ నాయర్ ఎల్ఐసీలో జోనల్ మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య టి.ఎన్. సావిత్రీదేవి, పిల్లలు దీపు, నివేదిత, దివ్య, శ్రీశాంత్ ఉన్నారు.

## జూనియర్ ఆసియా కప్: ఫైనల్‌కు భారత మహిళా హాకీ జట్టు

జూనియర్ ఆసియా కప్‌లో భారత మహిళా హాకీ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీ ఫైనల్‌లో దక్షిణ కొరియాపై భారత్ 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈసారి భారత అమ్మాయిలకు గట్టి పోటీనే ఎదురైంది. అయినప్పటికీ దక్షిణ కొరియాను భారీ తేడాతో చిత్తు చేసింది. కాగా ఈ టోర్నీలో ఇప్పటికే పురుషుల హాకీ జట్టు ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న సంగతి తెలిసిందే.భారత విజయంలో సుప్రియ కీలక పాత్ర పోషించింది. ఆమె ఏకంగా హ్యాట్రిక్ సాధించి ప్రత్యర్థిని హడలెత్తించింది. సుప్రియ మూడు గోల్స్ చేయగా.. మధు సిదార్, సుఖ్వీర్ కౌర్ చెరో గోల్ సాధించారు. దక్షిణ కొరియా తరపున యురి జెంగో ఒక్క గోల్ చేసింది.అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో పాకిస్థాన్‌ను భారత జట్టు ఏకంగా 19-0తో చిత్తు చేసింది. అదే జోరును సెమీఫైనల్లోనూ కొనసాగించింది. అయితే కొరియా కాస్త ప్రతిఘటించినప్పటికీ భారత అమ్మాయిలు ఎక్కడా ఒత్తిడికి గురి కాలేదు. ఈ విజయంతో భారత్ జూనియర్ ఆసియా కప్ టైటిల్‌కు మరో అడుగు దూరంలో నిలిచింది. మరో సెమీఫైనల్లో చైనా, జపాన్ జట్లు తలపడనున్నాయి. ఆ మ్యాచ్ విజేతతో భారత్ ఫైనల్లో టైటిల్ కోసం పోరాడనుంది.



## యూఎస్ ఓపెన్: టియాఫో చిత్తు.. ఫైనల్‌కు దూసుకెళ్లిన బెన్ షెల్టన్

అమెరికా యువ టెన్నిస్ సంచలనం బెన్ షెల్టన్ యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్‌లో టెన్నిస్ దిగ్గజం కార్లోస్ అల్కరాజ్‌ను ఓడించి సంచలనం సృష్టించిన అతడు.. సెమీఫైనల్లో తన దేశానికే చెందిన ఫ్రాన్సిస్ టియాఫోపై నాలుగు సెట్ల గేమ్‌లో విజయం సాధించాడు. ఎనిమిదో సీడ్ షెల్టన్.. టియాఫోను 4-6, 6-3, 6-3, 7-5 తేడాతో ఓడించి తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌లో అడుగుపెట్టాడు.తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరేందుకు ఇద్దరు అమెరికన్లు తలపడటంతో ఈ మ్యాచ్‌పై భారీ ఆసక్తి నెలకొంది. తొలి సెట్‌లో టియాఫో ఆధిపత్యం ప్రదర్శించాడు. 5-4 వద్ద షెల్టన్ అనూహ్యంగా డబుల్ ఫాల్ట్ చేయడంతో బ్రేక్ సాధించిన టియాఫో.. ఆ తర్వాత తన సర్వీస్‌ను నిలబెట్టుకుని 6-4తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. అయితే రెండో సెట్ నుంచే మ్యాచ్ స్వరూపం మారిపోయింది. షెల్టన్ దూకుడుగా ఆడుతూ తొలి గేమ్‌లోనే బ్రేక్ సాధించి 2-0 తేడాతో ఆధిక్యంలోకి వెళ్లాడు. టియాఫో వెంటనే బ్రేక్ సాధించి స్కోరును 2-2తో సమం చేసినా.. అతడి సర్వీస్‌లో నిలకడ లేకపోవడం షెల్టన్‌కు కలిసొచ్చింది. ఎనిమిదో గేమ్‌లో మరోసారి బ్రేక్ సాధించిన షెల్టన్ 5-3 ఆధిక్యంలోకి వెళ్లి సెట్‌ను గెలుచుకున్నాడు.మూడో సెట్‌లోనూ ఆధిపత్యం షెల్టన్‌దే. ఐదో గేమ్‌లో టియాఫో సర్వీస్‌ను బ్రేక్ చేసి 3-2తో ముందంజ వేశాడు. టియాఫో తీవ్రంగా పోరాడినా షెల్టన్ ఒత్తిడికి తలొగ్గలేదు. కీలక సమయంలో అద్భుతమైన రిటర్న్‌లతో పాయింట్లు సాధిస్తూ మూడో సెట్‌నూ తన ఖాతాలో వేసుకున్నాడు. నాలుగో సెట్‌లో ఇరువురూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకుంటూ సాగారు. మ్యాచ్ 12వ గేమ్‌కు చేరుకునే వరకు ఒక్కరికీ స్పష్టమైన ఆధిక్యం దక్కలేదు.



శ్రీచక్ర
ఆదివారం 13-09-2026



# సినిమా



## జూనియర్ ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో




ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.

## మహిళలే తాళి ఎందుకు ధరించాలి?



ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహ సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.

## నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.






## 'మహేంద్రగిరి వారాహి' సస్పెన్స్ థ్రిల్లర్



టాలీవుడ్ నటుడు సుమంత్ ఇటీవల అనగనగా, న్యూటన్ థర్డ్ లా వంటి సినిమాలతో మంచి సక్సెస్ అందుకున్నారు. అదే జోష్?లో ఆయన తాజాగా మహేంద్రగిరి వారాహి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దేవుడు, దెయ్యాలపై ఏ మాత్రం నమ్మకంలేని సిద్ధార్థ్ (సుమంత్) తన యూట్యూబ్ ఛానెల్?తో ప్రజకలను చైతన్యవంతులను చేస్తుంటాడు. అందులో మూఢ నమ్మకాల ప్రచారంతో జనాలను దోచుకునే బురిడీ బాబాల బండారాలకు సంబంధించిన వీడియోలు తన యూట్యూబ్ ఛానెల్?లో పోస్టు చేస్తుంటాడు. అయితే తన సోదరుడు రాజీవ్ (కమల్ కామరాజు)కి పెళ్లి ఖాయం అవుతుంది. కానీ, అతడి జాతకంలో అపమృత్యు దోషం ఉందని, వారాహి అమ్మవారికి పూజలు చేస్తే అది తొలగిపోతుందని చెప్తారు. ఇందుకోసం అతడు విజయనగరంలోని మహేంద్రగిరి ఆలయానికి వెళ్తారు. పూజలు పూర్తయ్యాక రాజీవ్‌తో పాటు ఎవరైనా 33వ పుట్టినరోజునే మరణిస్తారన్న ఆసక్తికర విషయం సిద్ధార్థ్‌కి తెలుస్తుంది. ఆ కుటుంబానికి వారాహి అమ్మవారి శాపంతోనే అలా జరుగుతుందని ఊళ్లో నమ్ముతారు. దీంతో ఆ మరణాల వెనుకు ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు సిద్ధార్థ్ రంగంలోకి దిగుతాడు. శపమేనా? అసలు సిద్ధు అన్న చావుకి, మహే ంద్రగిరి వంశానికి ఉన్న సంబంధం ఏంటి? అనేది బిగ్?స్క్రీన్?పై చూసి తెలుసుకోవాల్సిందే! మహేంద్రగిరి సంస్థానంలోని ఒక రాజవంశం చేసిన పొరపాటు వల్ల, వారాహి అమ్మవారి ఆగ్రహానికి గురై ఆ కుటుంబంలోని మగవాళ్లంతా 33వ పుట్టినరోజు నాడే చనిపోతుంటారు. దీంతో ఇది 'మురారి' సినిమాను గుర్తు చేస్తుంటుంది. కానీ ఇందులో ప్రతీకార నేపథ్యం కథకు కొత్త లుక్ తెచ్చింది. పాత్ర చుట్టూ నడిచే డ్రామా, హీరో ఫ్యామిలీ మహేంద్రగిరిలో అడుగుపెట్టాక వచ్చే ట్విస్ట్‌లు తో డైరెక్టర్ సంతోష్ ఈ మూవీని చాలా గ్రిప్పింగ్‌గా, వేగంగా ముందుకు నడిపించారు. ఇక ప్రీ ఇంటర్వెల్ సీన్స్?తో కథ ఆసక్తికరంగా మారుతుంది.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**